J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 39 27.2.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# గాడితప్పిన పాలన.. నీతి తప్పిన నిరసన!

- జుగుప్స కలిగిస్తున్న రాజకీయ పార్టీల వ్యూహాలు
- నిస్సిగ్గుగా అధికార, విపక్షాల మాయానాటకం
- అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో ఇదే తీరు
- దేశ ప్రతిష్టకు మాయనిమచ్చ అంటున్న విశ్లేషకులు




వంచనతో కూడిన వ్యూహాలు, ఆదుపుతప్పుతున్న ఆగడాలతో రాజకీయాలు రక్తిగడుతున్నాయి. ఒకరినొకరు లక్ష్యంగా చేసుకునే క్రమంలో కొందరు నాయకులు సెల్ఫ్‌గోల్‌తో బొక్కబోర్లా పడుతుంటే, మరికొందరు రెంటికీ చెడ్డరేవడిగా మిగిలిపోతున్నారు. ఇంకొందరు అధికారాన్ని సొంతజాగీరులా భావిస్తూ, దేశ సార్వభౌమత్వాన్నే పణంగా పెడుతున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఇదే తంతు కనిపిస్తోంది. ఈ విపరీత ధోరణికి అంతేలేదు అన్నట్లుగా రాజకీయ నాయకులు ఎవరిస్థాయిలో వారు తమ నటనాకౌశలాన్ని ప్రదర్శిస్తూ దేశాన్ని అథోగతిపాలు చేస్తున్నారు. తాజాగా ఢిల్లీలో ముగిసిన ఏఐ సమ్మిట్‌లో చోటు చేసుకున్న అర్ధనగ్న ప్రదర్శనలు, ఇటీవల బిల్‌గేట్స్ ఏపీ పర్యటనలో కనిపించిన నిరసనలు, విమర్శలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

2లో



## నెల్లూరు నగర 5వ మేయర్‌గా దేవరకొండ సుజాత

నెల్లూరు జిల్లా రాజకీయాలలో గత కొన్ని నెలలుగా చర్చనీయాంశంగా మారిన నెల్లూరు నగర మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ఉదంతానికి ఎట్టకేలకి ఫిబ్రవరి 26వతేదీ శుభం కార్డు పడింది. కొత్త మేయర్‌గా 53వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ సుజాత ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది.

3లో



శుభాకాంక్షలు

మా ప్రియ నేస్తం
సాయితేజ - కీర్తన
ముచ్చటగా చేయి చేయి కలిపి
ఏడడుగులు కలిసి నడచి
దంపతులైన శుభ సమయంలో
మా శుభాకాంక్షలు.

ప్రజిత్ - సునీల్ - రాఘువేంద్ర - వర్షిత్ - ధీరజ్
ఫ్రెండ్స్ ఫర్ ఎవర్

# గాడితప్పిన పాలన.. నీతి తప్పిన నిరసన!

(మొదటిపేజీ తరువాయి)

ఎదుటివారిని ఏకాకులుగా చేసేందుకు, ప్రత్యర్థులపై పగ సాధించేందుకు, కానివారిని కనీదీరా దెబ్బ కొట్టేందుకు రాజకీయ పార్టీలు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉండడం సహజం. అయితే, ఈ క్రమంలో నైతిక విలువలకు తిలోదకాలిస్తూ, దేశ గౌరవాన్ని సైతం దిగజార్చే రీతిలో నాయకులు వ్యవహరిస్తుండడం భారత భావి రాజకీయ భావజాలాన్ని చెప్పకనే చెబుతోంది. దేశంలో ఇటీవల చోటుచేసుకున్న రెండు ఘటనలు గాడి తప్పిన పాలనకు.. నీతిలేని నిరసనలకు నిదర్శంగా నిలిచాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో ఏఐ గ్లోబెల్ సమ్మిట్ కేంద్రంగా చోటుచేసుకున్న గందరగోళం దేశాన్ని విస్తుపోయేలా చేసింది. 60 దేశాల ప్రతినిధులు, దాదాపు పది దేశాలకు చెందిన దేశాధినేతలు, అంతర్జాతీయ వ్యాపార, టెక్ దిగ్గజాలు పాల్గొన్న ఏఐ సమ్మిట్ ఆరంభంలోనే కొంత వివాదాస్పదమైంది. తొలిరోజే కనీస మౌలిక సౌకర్యాలు సరిగ్గా అందక వచ్చినవారు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దీంతో కేంద్ర ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే దీనికి కారణం, అనుకున్న దానికంటే సమ్మిట్‌కు ఎక్కువ మంది సందర్శకులు, నిపుణులు, ప్రతినిధులు రావడమే అని కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరణ ఇచ్చారు. ఏఐ గ్లోబెల్ సమ్మిట్‌కు వచ్చి ఇబ్బంది పడినవారికి ఆయన బహిరంగంగా క్షమాపణలు కూడా చెప్పారు.

## కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్...?

అంతర్జాతీయ ఏఐ సమ్మిట్‌లో నిర్వహణాలోపాలే దేశానికి పెద్ద అపవాదు అనుకుంటుంటే సరిగ్గా అదే సమయంలో సమ్మిట్ పరిసరాల్లో యువజన కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్న ప్రదర్శనలకు దిగడం తీవ్ర విమర్శలకు కారణమైంది. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ట్రేడ్ డీల్ లోపభూయిష్టంగా ఉందని, ప్రధాని మోదీ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉండడం, మోదీ మిత్రుడు, ప్రముఖ వ్యాపారవేత్త అదానీకి సంబంధించిన కంపెనీలపై అమెరికాలో కేసులు నమోదు కావడంతోనే ట్రేడ్ డీల్ పేరుతో ఇండియా సార్వభౌమాత్వాన్ని బీజేపీ డొనాల్డ్ ట్రంప్‌కు తాకట్టు పెట్టిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అయితే పారిశ్రామిక విప్లవం 4.0గా చెప్పుకునే ఏఐ అభివృద్ధికి ప్రపంచ దేశాలు పోటీలు పడుతుంటే, తొలిసారిగా ఏఐ సమ్మిట్ నిర్వహించిన భారత్ దాని నిర్వహణ, సౌకర్యాల కల్పనలో విఫలం కావడం, దానికి ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం రెండూ కారణం కావడం దేశానికి దాపురించిన రాజకీయ రోగాన్ని బట్టబయలు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏఐ సమ్మిట్‌లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన గల్గోటియాస్ యూనివర్సిటీ ప్రతినిధి చైనా తయారు చేసిన ఓ ఏఐ టూల్ (రోబోటిక్ డాగ్)ను తమ రూపకల్పనగా చెప్పుకోవడం దేశ ప్రతిష్టను అబాసుపాలు జేసింది. సమ్మిట్‌లో ప్రదర్శించే ఆవిష్కరణలకు సంబంధించిన ఇన్నోవేషన్స్‌ను ముందస్తుగా పరిశీలించకుండా గల్గోటియాస్ యూనివర్సిటీ రూపొందించిన టూల్‌ను నిర్వాహకులు సదస్సులో ఎలా అనుమతించారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏఐ సమ్మిట్ అటు ఆవిష్కరణల పరంగానూ, ఇటు నిర్వహణ పరంగానూ, ఆపై నిరసనల పరంగానూ వివాదాలకు కేంద్ర బిందువయ్యిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు శృతి మించి షర్టులు విప్పి అంతర్జాతీయ ప్రముఖుల ముందు నీచ రాజకీయానికి పాల్పడడం అత్యంత హేయమైన చర్యగా నిలిచింది. దేశంలో యువతంతా మోదీకి వ్యతిరేకం అనేలా ఫోకస్ చేసే క్రమంలో కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలతో అంతర్జాతీయ వేదికపై భారీ తప్పిదానికి పాల్పడిందనడంలో సందేహం లేదు.

## ఎవరిస్థాయిలో వారు.. కాంగ్రెస్ బేజారు..!

కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు చేసిన మతిలేని చర్యను, ఓ రాజకీయ అవకాశంగా అందిపుచ్చుకునేందుకు బీజేపీ సహా దాని మిత్రపక్షాలు గళమెత్తాయి. తెలుగు రాష్ట్రాల్లో అయితే వ్యతిరేక పార్టీలు సైతం అన్నీ ఏకమై పోటీపడడం గమనార్హం. అంతర్జాతీయ సమ్మిట్ జరుగుతున్న చోట అర్ధనగ్న ప్రదర్శనలకు పాల్పడి కాంగ్రెస్ ఏకంగా దేశద్రోహానికి పాల్పడిందంటూ బీజేపీ ఎప్పటిలా ఇండియా ప్రతిష్ట అనే సెంటిమెంట్ కార్డుతో విరుచుకుపడింది. తద్వారా సమ్మిట్ నిర్వహణలో తమ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కవర్ చేసుకునే ప్రయత్నం చేసింది. సిద్ధాంత పరంగా కాంగ్రెస్, బీజేపీ ప్రత్యర్థులు కనుక ఇది సహజమే. అయితే తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నాయకులు ఈ విషయాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు తాపత్రయం పడడం మాత్రం ఆసక్తి కలిగించింది. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొనసాగుతున్నా, షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ మాత్రం దానికి అప్రకటిత మిత్రపక్షంగానే వ్యవహరిస్తోంది. అలాంటి సమయంలో లోకేష్ చొరవ తీసుకుని మరీ కాంగ్రెస్‌పై అకస్మాత్తుగా విరుచుకుపడడం చర్చనీయాంశంగా మారింది. ఇదంతా మోదీ దృష్టిలోపడేందుకే అన్నది బహిరంగ రహస్యం. ఇక జగన్ కూడా సందిట్లో సడేమియా అంటూ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. అర్ధనగ్న ప్రదర్శనలతో కాంగ్రెస్ నాయకులు దేశప్రతిష్టను మంట గలిపారంటూ ఆరోపించారు. ఇదంతా మోదీ ప్రాపకం కోసం పాకులాడే ప్రయత్నంలో, ఏపీలో ఒక్కశాతం ఓట్ షేర్ కూడా లేని చిట్టెలుకలాంటి కాంగ్రెస్‌పై జగన్ చేసిన ముష్టియుద్ధం అనే విమర్శలు సామాజిక మాధ్యమాలలో వ్యక్తమయ్యాయి. ఇక బీజేపీ తమకు మిత్రపక్షం కాదంటూనే, కాంగ్రెస్‌పై ఉన్న కోపాన్ని చూపెట్టడం కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తాపత్రయపడినట్లు కనిపించింది. ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలోనే కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు అక్కడ అర్ధనగ్న ప్రదర్శన చేయడమే ఆ పార్టీ మూర్ఖత్వానికి పరాకాష్ట అంటూ సెటైర్లు వేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే, అర్థంలేని, అవసరంలేని అర్ధనగ్న ప్రదర్శనలతో కాంగ్రెస్‌పార్టీ ఉన్న పరువు పోగొట్టుకోగా, బీజేపీ దాన్ని క్యాష్ చేసుకునేందుకు యత్నించింది. ఇక తెలుగుదేశం, జనసేన, జగన్‌పార్టీ, బీఆర్ఎస్, మోదీ దృష్టిలోపడి మార్కులు కొట్టేసేందుకో లేక తామూ మీవెంటే ఉన్నామని చెప్పుకునేందుకో చేసిన ఫీట్లులా కనిపించింది.

## ఏపీలో బిల్‌గేట్స్ కేంద్రంగా మురికి రాజకీయం!

ఇక ఆంధ్ర విషయానికి వస్తే, ఇటీవల గేట్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ పర్యటన కూడా రాజకీయ వివాదాలకు కేంద్రబిందువైంది. నిజానికి వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఉన్నా వ్యాపార దిగ్గజంగా, లక్షల కోట్ల రూపాయలు ప్రజా అవసరాల కోసం దానంగా ఇచ్చిన వితరణశీలిగా మాత్రం బిల్‌గేట్స్‌కు తిరుగులేదన్న విషయాన్ని అందురూ అంగీకరిస్తారు. అయితే ఈ విషయాన్ని మరచి ఆయన పర్యటనపై కూడా విపక్ష నాయకులు, సోషల్ మీడియాలోని ఓ వర్గం బిల్‌గేట్స్ ఓ అనామకుడు, స్త్రీలోలుడు అనేలా కించపరుస్తూ విమర్శలు చేయడం దారుణమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. నిజానికి బిల్ అండ్ మిలిందా గేట్స్ పేరుతో ఓ ఫౌండేషన్‌ను బిల్‌గేట్స్ ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సేవలందిస్తున్నారు. ఆయన ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా సంజీవని అనే కొత్త పథకాన్ని ప్రారంభించింది. పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, సేవలందించే ఈ పథకం విజయవంతమైతే రాష్ట్రానికే మంచిది. ఈ మొత్తం వ్యవహారంలో బిల్‌గేట్స్‌కు ఖర్చుతప్ప ఒరిగే లబ్ధిలేదు. అలాంటిది బిగ్‌గేట్స్‌ని నీచుడు, నికృష్టుడు అంటూ విమర్శలు చేయడం, ఆయన రాకను నిరసిస్తూ ఆందోళనలకు దిగడం ఏంతమాత్రం సహేతుకం కాదు. ఏ అంశాన్ని రాజకీయం చేయాలి, ఏ అంశంలో ఏంతవరకు ప్రభుత్వాన్ని విమర్శించాలో ప్రతిపక్షాలు ఆలోచించుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ ఇష్టారాజ్యంగా అరెస్టులు, నిర్భంధాలకు పాల్పడితే, ప్రతిపక్షం కూడా అదే స్థాయిలో ఎదురుదిరిగే అవకాశం ఉంటుంది. ఈ విష సంస్కృతి మారాలంటే ప్రతిచిన్న విషయాన్ని కూడా పార్టీలు రాజకీయ కోణంలో చూడకుండా విజ్ఞతతో వ్యవహరించాల్సి ఉంది. ముఖ్యంగా అంతర్జాతీయ సదస్సులు, అంతర్జాతీయ స్థాయి నేతలు, వ్యాపార దిగ్గజాలు, ప్రముఖులు దేశానికి, రాష్ట్రానికి వచ్చినప్పుడు రాజకీయ పార్టీల నాయకులు విచక్షణ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే విశ్వ వేదికపై భారత ప్రతిష్ట దెబ్బతినడంతో పాటు పెట్టుబడిదారులు కూడా భారత్‌వైపు కన్నెత్తిచూసే అవకాశం ఉండదు. ముఖ్యంగా అప్పులకుప్పగా మారి, ఆర్థికంగా అష్టకష్టాలు పడుతున్న ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలకు ఇది అత్యంత ముఖ్యం. ఈ విషయాన్ని గుర్తించి అధికార ప్రతిపక్షాలు సంయమనంతో వ్యవహరించినప్పుడే రాష్ట్ర భవిష్యత్‌కు గట్టిపునాదులు పడతాయి. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

అలాకాకుండా కక్షలు, కార్పణ్యాలు, వ్యక్తిగత విబేధాలతో కుహనా రాజకీయాలు చేస్తే అసలుకే మోసం జరుగుతుందన డంలో సందేహం లేదు. ఇది ఢిల్లీ నుంచి గల్లీదాక అన్ని పార్టీల రాజకీయ నేతలు గుర్తుపెట్టుకోవలసిన కీలకాంశమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు...!

## మార్చి 1న నెల్లూరు నగరంలో
# ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహ శంకుస్థాపన



భారతీయ సినిమా గాయకులు.. మన నెల్లూరీయులు దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని నెల్లూరులో ప్రతిష్ఠించాలన్న బాలు అభిమానుల ఆరు సంవత్సరాల కోరిక ఎట్టకేలకు భారత దేశ 13వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి చొరవతో తీరబోతోంది. బాలు విగ్రహ ప్రతిష్ఠాపనకి సంబంధించిన శంకుస్థాపన మార్చి1వ తేదీ, ఆదివారం జరుగబోతోంది. ఆరోజు ఉదయం 9.00 గంటలకి నెల్లూరు అన్నమయ్య కూడలిలోని ఎన్టీఆర్ పార్కు నందు జరిగే ఈ కార్యక్రమంలో మునిసిపల్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత, సుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, మునిసిపల్ కమిషనర్ వై.ఓ.నందన్, తదితర అధికార అనధికార ప్రముఖులు, సంగీతప్రియులు, బాలు అభిమానులు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే!

## ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం..
# 27న సీపీఎం ర్యాలీ

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 27న నెల్లూరు నగరంలో ర్యాలీ జరుగనుంది. ఈ నెలాఖరు నుంచి జిల్లావ్యాప్తంగా వరికోతలు ప్రారంభమవుతాయి కనుక, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని నాయకులు కోరుతున్నారు. ఈ సీజన్‌లో కనీసం 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్లోకి వస్తుందని సీపీఎం జిల్లా కార్య దర్శి మూలం రమేష్, జిల్లా రైతుసంఘం నాయకులు మూలి వెంగయ్య, శివశంకర్ తదితరులు తెలిపారు.

## • పరామర్శ



ఇటీవల దివంగతులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, శ్రీ వేదగిరి నరసింహస్వామి దేవస్థానం మాజీ ఛైర్మెన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి కుటుంబసభ్యులను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. శ్రీనివాసులురెడ్డి కుమారుడు అచ్యుత్‌రెడ్డిని, ఇతర కుటుంబసభ్యులని ఓదార్చారు.

# రేషన్ డీలర్ల సమస్యలు తీర్చాలి

## • జేసీకి నాయకుల వినతి

జిల్లాలోని రేషన్ డీలర్ల సమస్యలు తీర్చాలంటూ డీలర్ల సంఘం నాయకులు కోరుతున్నారు. తమకు ఇచ్చే కమీషన్‌ను పెంచి ఇవ్వాలని, తద్వారా ఆర్థిక భద్రత కల్పించాలని వారు ఈనెల 25న జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా యునైటెడ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు జేసీని కలిసి తమ గోడు వినిపించారు. ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ షాపు అద్దె, డోర్ డెలివరీ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని, దీంతో తమ కుటుంబాలు ఆర్థికంగా బాగా ఇబ్బందులు పడుతున్నాయని వారు విన్నవించుకున్నారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలు దారుణం

## • నెల్లూరులో వెల్లువెత్తిన నిరసనలు





నిరసన ర్యాలీలో సిఐటియు నాయకులు

విద్యుత్ బస్సులు నడుపుతామనే పేరుతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు పరం చేస్తే సహించేది లేదని నెల్లూరులో నిరసనలు వెల్లువెత్తాయి. ఆర్టీసీ జేఏసీ నాయకులతో కలిసి ఈనెల 24న సీఐటీయు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నగరంలో ర్యాలీ నిర్వహించి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన ఆందోళనలో వారు మాట్లాడుతూ, విద్యుత్ బస్సుల నిర్వహణకు పినాకిల్ అనే ప్రైవేటుసంస్థకు ఆర్టీసీ స్థలాలను అప్పగించే ఒప్పందం చేసుకోవడం దారుణమన్నారు. క్రమేణా ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనలతోనే ఇలాంటి ఒప్పందాలు చేసుకుంటున్నారని సీఐటీయు జిల్లా నాయకుడు టీవీ ప్రసాద్ విమర్శించారు. ఈ ఆందోళనలో సీఐటీయు నాయకులు నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సుధాకర్, పెంచలనరసయ్య, ఆర్టీసీ జేఏసీ నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, శంకరయ్య, నరసింహారెడ్డి, చంద్రమౌళి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# 5వ మేయర్‌గా.. దేవరకొండ సుజాత

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిస్థాయి 5వ మేయర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం ఉదయం జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో నగర 5వ మేయర్‌గా దేవరకొండ సుజాతని 40వ డివిజన్ కార్పొరేటర్ ప్రస్తుత ఇంచార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ ప్రతిపాదించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. వైసీపీ కార్పొరేటర్లు సభకి గైరుహాజరు కావడం, సుజాతకి ఎలాంటి పోటీ లేకపోవడంతో ఎన్నిక ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారికంగా సుజాత పేరుని మేయర్‌గా ప్రకటించి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇంచార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కరరెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఓ.వై.నందన్ పలువురు పార్టీ కార్పొరేటర్లు ఆమెని శాలువతో సత్కరించి అభినందించారు.




నూతన మేయర్ సుజాతని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు

## దేవరకొండ సుజాత - నేపథ్యం:

దేవరకొండ సుజాత నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 53వ డివిజన్ (వెంకటేశ్వర పురం ప్రాంతం) కార్పొరేటర్‌గా ఉన్నారు. ప్రస్తుతం ఆమె తెలుగుదేశం పార్టీలో కొనసాగు తున్నారు. నిజానికి ఆమె గతంలో వైసీపీ నుండి గెలిచినప్పటికీ, రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసీపీతో విభేదించి టీడీపీలోకి మారినప్పుడు దేవరకొండ సుజాత కూడా శ్రీధర్‌రెడ్డి వెంటే నడిచి పార్టీ మారిన కార్పొరేటర్లతో పాటు తానూ అనుస రించారు. వాస్తవానికి నెల్లూరు మేయర్ పీఠం ఎస్టీ మహిళకు రిజర్వ్ అయింది. అయితే, మాజీమేయర్ పొట్లూరి స్రవంతి రాజీనామా చేయడంతో ఖాళీగా వున్న కుర్చీలో ఇంచార్జ్ మేయర్‌గా రూప్‌కుమార్‌యాదవ్ కూర్చున్నారు. అనేక వడపోతల తర్వాత టీడీపీ అధి ష్టానం సుజాత పేరును ఖరారు చేసింది. సుజాతకి మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. ఒక సాధారణ కార్పొరేటర్ స్థాయి నుండి మేయర్ స్థాయికి ఎదిగిన సుజాత, నెల్లూరు అభివృద్ధిలో, ముఖ్యంగా పేదల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నెల్లూరు నగర 5వ మేయర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న దేవరకొండ సుజాతకి 'లాయర్' అభినందనలు.

# కళ్యాణ వైభవం...!



## కీర్తన - సాయితేజ

నెల్లూరీయులకి చిరపరిచితుడు , మహబూబ్ నగర్ వాస్తవ్యులు, తెలంగాణ పంచాయతీరాజ్ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న యర్రగొండ శ్రీనివాస్‌రెడ్డి - శ్రీమతి కుసుమల కుమార్తె **కీర్తన - సాయితేజ** ( ఇండొనేషనల్ లిమిటెడ్ విశ్రాంత ఉద్యోగి యరమాక శ్రీనివాసులురెడ్డి - శ్రీమతి నిరూపల కుమారుడు)ల వివాహం ఫిబ్రవరి 25వ తేదీ హైదరాబాదులో వైభవంగా జరిగింది.

సాయితేజ - కీర్తనలకి లాయర్ శుభాశీస్సులు.

# చెస్‌లో 'నేహ' ప్రతిభ!

### శాప్ లీగ్ పోటీల్లో కాంస్య పతకం

ఇటీవల తిరుపతిలో జరిగిన 'రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ చెస్ పోటీల్లో నెల్లూరు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన యస్.వి. చెస్ అకాడమీ క్రీడా విద్యార్థి రాసపుత్ర నేహ తన ప్రతిభని చాటుకుంది. అండర్-15 వయో విభాగంలో మూడవ స్థానం సాధించి, కాంస్య పతకం గెలుచుకుంది. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న నగరంలో జరిగిన అభినందన కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్' ప్రధానకార్యదర్శి వై.సుమన్ పాల్గొని, నేహను అభినందించారు. జిల్లాకు మంచి పేరుప్రతిష్టలు తీసుకోని వచ్చే విధంగా క్రీడాకారులను తీర్చి దిద్దే యస్.వి.చెస్ అకాడమీ కోచ్‌లు యస్.వంశీకృష్ణ, సుధాశ్రీలను



నేహ తల్లి రాసపుత్ర అశ్వినిల కృషిని కూడా అయన ప్రశం సించారు. ఈ కార్యక్రమంలో పలువురు చెస్ క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో..దేవిరెడ్డి శారదకి నివాళి



***కీర్తిశేషులు శ్రీమతి దేవిరెడ్డి శారద 9వ వర్ధంతి సందర్భంగా ఈనెల 26న అల్లూరు మండలం నార్త్ మోపూర్ గ్రామంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆమె కుటుంబసభ్యులు, డిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు, స్థానిక ప్రజలు అందరూ ఆమెను మనసారా స్మరించుకుంటూ, సేవాకార్యక్రమాలతో ఆమెకి నివాళులర్పించారు.***

దేవిరెడ్డి శారద స్మారకంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో, నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ-బ్లడ్ బ్యాంక్ వారి సహకా రంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నార్త్‌మోపూరు గ్రామం నుంచే కాక, అల్లూరు తదితర ప్రాంతాల నుంచి కూడా యువకులు వచ్చి రక్తదానం చేయడం విశేషం. తొలుత, ఈ శిబిరాన్ని మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. దాదాపు 110 మంది రక్తదాతలు దేవిరెడ్డి శారద స్మృత్యంకంగా రక్తదానం చేయడాన్ని ఆయన అభినందిం చారు. సేవాభావంతో చేసే ఇలాంటి కార్య క్రమాలు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలచిపోతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, దేవిరెడ్డి శారద ప్రైమరీ హెల్త్‌సెంటర్ డాక్టర్ జెట్టి రమేష్, దేవిరెడ్డి శారద హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట పెన్నిధిగా.. ట్రస్ట్



దేవిరెడ్డి శారద స్మారకంగా, ఆమె భర్త దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్‌వారు తొలినుంచీ ఎన్నో సేవా కార్య క్రమాలను నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. సేవాభావం, దాతృత్వగుణం కలగలసిన తన సతీమణి దేవిరెడ్డి శారద పేరును చిరస్థాయిగా నిలపాలనే సదా శయంతో ఆయన ట్రస్ట్ ద్వారా పేదలు, దీనులు, అసహాయులకు అనేకరకాలుగా సేవలందిస్తున్నారు. పేద విద్యార్థులకు విద్య, అభాగ్యులకు వైద్యం అందించేందుకు ట్రస్ట్ ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేప ట్టింది కూడా. 2024లో నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో సుమారు 40 కోట్ల రూపాయల వ్యయంతో, పేదలకు కార్పొ రేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తేవాలనే మహత్తర ఆశయంతో అత్యంత అధునాతన వైద్యాన్ని అందించేందుకు భారీ భవనాల నిర్మాణం గావిస్తున్నారు కూడా. సింహపురి సేవాసమితి ఆధ్వర్యంలో, దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి స్ఫూర్తితో, వారి సోద రుల సహకారంతో కుటుంబసభ్యులంతా కలసి ఈ అధునాతన వైద్యశాల నిర్మాణా నికి సంకల్పించడం ఎంతో విశేసం.

ఇప్పటికే నార్త్‌మోపూరులో పేద విద్యా ర్థులకు హైస్కూలు, అభాగ్యులకు వైద్యం చేసేందుకు ప్రైమరీ హెల్త్‌సెంటర్, నిరు పేద మహిళకు జీవనభృతి కల్పించేందుకు కుట్టుపనిలో శిక్షణ ఇస్తూ, యువతీయువ కుల జీవనాధారంగా కంప్యూటర్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ కూడా నిర్వహిస్తున్నారు. సౌజన్యమూర్తి అయిన దేవిరెడ్డి శారద పేరును అందరూ చిరస్థాయిగా తలచుకునే విధంగా కోట్లాదిరూపాయలను పేదల అభ్యున్నతి కోసం ట్రస్ట్ ద్వారా వెచ్చిస్తు న్నారు. ఆ మహనీయురాలిని స్మరించు కుంటూ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఒక్క నార్త్ మోపూరు లేదా, అల్లూరు మండలంలోనే కాక, జిల్లా-రాష్ట్రస్థాయిల్లో సైతం అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి కూడా.

# లస్కర్లు, గేట్ ఆపరేటర్ల పోస్టులను భర్తీచేయాలి

### - బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల వినతి

జలవనరుల శాఖలో లస్కర్లు, ఫిట్టర్లు, గేట్ ఆపరేటర్లు, పంప్ ఆపరేటర్ల ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీచేయాలని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ నెల్లూరులోని తెలుగు గంగ ప్రాజెక్టు కార్యాలయ పరిపాలనాధికా రికి ఈనెల 25న ఒక వినతిపత్రంలో విన్న వించారు. రాష్ట్రంలోని పలుజల ప్రాజెక్టు లలో 7227 లస్కర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అసెంబ్లీలో ప్రక టించారని, వాస్తవానికి ఆ ఖాళీలు అన్నీ కలిపి పదివేలకు పైగానే ఉన్నాయని ఆయన తెలిపారు. జీవో నెంబర్ 98 ప్రకారం ప్రాజెక్టుల ముంపు నిరుద్యోగులకు ఇంటికొక ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం పరిశీలించి, గతంలోలాగే లస్కర్లు, ఆపరేటర్లగా ముంపు నిరుద్యోగు లకు ఉద్యోగాలిచ్చి శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని ఆయన కోరారు.



లాయర్
ఫిబ్రవరి 27, 2026

# కల్తీ పాలు.. పెరిగిపోతున్న పాపాలు!

అసలే ఇది కలికాలం..అందులోనూ కల్తీల కాలం. దేంట్లో చూసినా కల్తీలే. ఏ వస్తువు చూసినా ఏమున్నది గర్వకారణం. అంతా కల్తీమయం అన్నట్లుగా తయారైపోతోంది దేశం. కారణం..మనిషి స్వార్ధానికి అంతే ఉండడం లేదు. ఎవరేమైపోయినా పర్వాలేదు..తాము బాగుంటే చాలు..అనే స్వార్థమే. ధనార్జనకోసం చివరికి అమృతం లాంటి పాలను కూడా విషపూరితంగా మార్చేసే దుస్థితులు దాపురించాయిప్పుడు. పాలల్లో నీళ్లు కలిపి కల్తీ చేయడం అన్నది పాత మాట. పాలు లేకుండానే పాలు, నెయ్యి లేకుండానే నెయ్యిని రసాయనాలతో, విషపూరిత పదార్ధాలతో తయారుచేసే నీచ పరిస్థితులు రాజ్యం చేస్తున్నాయిప్పుడు. అక్రమ డబ్బు సంపాదన కోసం ఒక్క పాలలోనే కాదు, పాలతో తయారుచేసే పదార్ధాలు అన్నిటినీ కల్తీ చేసేసే మోసగాళ్ళకి మనదేశంలో కొదవలేదు. దేశవ్యాప్తంగా ఇలాంటి కేసులు ఏటా వేల సంఖ్యలోనే ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. అంతేకాదు, ఈ కల్తీల కాటుతో ఏటా లక్షలాది మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి కూడా. ప్రజారోగ్యాన్ని ఇంతగా కుళ్ళబొడిచే కల్తీ మాయగాళ్ళని దండించేందుకు తగ్గ శిక్షలు లేకపోవడం, ఒకవేళ ఉన్నా, ఆచరణలో నామమాత్రంగానే ఉంటుండడం ఈ అనర్ధాలకి మరో కారణం. అత్యధికశాతం కేసుల్లో పోనీలే అంటూ.. జరిమానాలతోనే సరిపెడుతుండడంతో కల్తీ మాయగాళ్ళు 'పట్టుకున్నప్పుడు చూద్దాం లే' అనుకుంటూ తమ కల్తీలను యదేచ్ఛగా కొనసాగిస్తూనే ఉన్నారు. దేంట్లో కల్తీ ఉందో కూడా తెలియక అమాయక ప్రజలు అందుబాటులో ఉండే ఆహారపదార్ధాలను తినేస్తూ నానారకాల రోగాల పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ నరకయాతనలు పడుతుంటే, కల్తీచేసేవాళ్ళు మాత్రం షావుకారులై దర్జాగా ఉంటున్నారు. దేశమంతా ఇదే దుస్థితి ఉన్నా, పట్టించుకునే నాథులు లేరు. అన్నపూర్ణలాంటి ఆంధ్రలో కూడా ఇలాంటి కల్తీమోసాలు ఇటీవలికాలంలో మరింతగా పెరిగిపోతూనే ఉన్నాయి. మొన్నటికి మొన్న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీపాల ఘటనలో ఏకంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం రాష్ట్రవ్యాప్తంగా కలవరం పుట్టిస్తోంది. ఆసుపత్రుల్లో ఇంకా పదిహేను మంది చికిత్సలు పొందుతున్నారు. పచ్చని ప్రకృతికి ఆలవాలమైన కోనసీమలాంటి ప్రాంతాల్లో కూడా ఇలాంటి కల్తీల కక్కుర్తి విజృంభిస్తుండడం ఘోరం. కల్తీపాలు వికటించడంతో, వాటిని తాగిన పలువురికి కిడ్నీలు దెబ్బతిన్నాయని, వారిలో 8 మంది పరిస్థితి క్లిష్టంగా ఉందని కూడా అధికారులు చెప్తున్నారు. అనధికారికంగా పాలను విక్రయించే ఓ పాల వ్యాపారి నిర్లక్ష్యం, పాడైపోయిన ఫ్రీజర్‌ని పాలనిల్వకు వాడడం, అది లీకేజీలకు గురై పాలు పాడైపోవడం, ఆ చెడిపోయిన పాలను పంపిణీ చేయడం వంటివి ఈ దారుణాలకి మూలమంటున్నారు. పూర్తిస్థాయిలో విచారణ నివేదికలు వస్తే తప్ప, ఎక్కడ ఎలాంటి తప్పిదం జరిగిందో తేటతెల్లం కాదు. ఈ ఘటనకి సంబంధించి ఇప్పటికే ఒక వ్యాపారిని అరెస్ట్ చేశారు, అయితే, ఈ ఘటనలో పోయిన ప్రాణాలను ఎవరు కాపాడగలరు?.. ఒక్క పాలల్లోనే కాదు, అసలు కల్తీ లేనిదెక్కడ?.. ఏ పదార్థంలో కల్తీ లేదో చెప్పండి. ప్రతి వస్తువులోనూ కల్తీలే.. లేదంటే నాసిరకాలు. ధనాశ పెరగడం, అవినీతి సర్వాంతర్యామి కావడంతో మనం పీల్చే గాలి, తాగేనీరు, తినే తిండితో సహా అన్నీ కల్తీమయం అయిపోతున్నాయి. ఎంతోమంది పిల్లలు, పెద్దలు ఈ కల్తీలకి గురై నిత్యం బాధలు పడుతూనే ఉన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు ఈ కల్తీలపై కొరడా ఝుళిపించాలి. ఆహారభద్రతా వ్యవస్థను సరైన దిశలో నడిపించే వ్యవస్థలు లేకపోవడంతో, కల్తీలు విషవృక్షంలా సమాజాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార భద్రతా వ్యవస్థను వెంటనే కట్టుదిట్టం చేయాలి. కల్తీలతో ప్రజారోగ్యాన్ని గుల్ల చేస్తున్నవారిపై వెనువెంటనే కఠినశిక్షలు పడేలా చట్టాలను సవరించాలి. కల్తీ చేయాలంటే భయపడేలా శిక్షలుండాలి. కల్తీలను గుర్తించే నిష్పక్షపాతమైన అధికార బృందాలను అన్ని రాష్ట్రాల్లోనూ నియమించాలి. నిఘా వ్యవస్థలను కూడా రంగంలోకి దింపి ఎక్కడెక్కడ భారీస్థాయిలో కల్తీలు జరుగుతున్నాయో కనిపెట్టాలి. కల్తీమాఫియాలను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. కల్తీ నేరాలను అరికట్టేందుకు అవసరమైతే ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలి. వాటితో పాటు..ఏ వస్తువులో ఎలాంటి కల్తీలు జరుగుతున్నాయో, వాటి నుంచి ప్రజలు ఎలా జాగ్రత్తపడాలో నిపుణులు తెలియజెప్పాలి. ప్రభుత్వాలు, మేధావులు, స్వచ్ఛంధ సంస్థలు కంకణం కట్టుకుని, కల్తీలకి వ్యతిరేకంగా గ్రామగ్రామానా ప్రజల్లో అవగాహన కల్పించకపోతే, ఈ కల్తీ మాయాజాలాలు మరింతగా విస్తరించి... సమాజానికి, ప్రజారోగ్యానికి పెనుముప్పుగా తయారవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

# సుప్రీం తీర్పుతో.. ట్రంప్ డీలా

మనసులో మాట 86

ఈ ఏడాది ప్రారంభంలో డొనాల్డ్ ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాలపై అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, అంతర్జాతీయ వాణిజ్య చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించింది. అది ప్రపంచ ఆర్థిక గమనాన్ని మార్చే ఒక శక్తివంతమైన మలుపు. 2026లో అంతర్జాతీయ వాణిజ్యం కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో, ఈ తీర్పు అమెరికా అధ్యక్షుడి విశేషాధికారాలకు ఒక గట్టి హెచ్చరికగా నిలిచింది. ఇది కేవలం అమెరికా అంతర్గత చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు; ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య దేశాలకు, ముఖ్యంగా భారతదేశం వంటి ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలకు రక్షణ కవచంగా నిలిచింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే ప్రాథమిక అధికారం 'కాంగ్రెస్'కే.. అంటే చట్టసభలకే ఉంటుందని, అధ్యక్షుడికి లేదని కోర్టు 6–3 మెజారిటీతో తేల్చి చెప్పింది. అధ్యక్షుడు కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పరిమిత అధికారాలను కలిగి ఉంటారని, వాటిని శాశ్వత ఆర్థిక విధానాలుగా మార్చలేరని కోర్టు తేల్చి చెప్పింది. ఇది ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానానికి తగిలిన పెద్ద ఎదురుదెబ్బ.

అమెరికా అధ్యక్షుడి ఆర్థిక అధికారాలకు కళ్లెం పడటంతో, రష్యా నుండి చమురు దిగుమతులపై భారత్‌కు ఒక కొత్త వెసులుబాటు లభించింది. భారతదేశం తన చమురు అవసరాలలో అధిక భాగాన్ని రష్యా నుండి తక్కువ ధరకే పొందుతోంది. గతంలో అమెరికా ఒత్తిడి వల్ల కొన్ని భారతీయ కంపెనీలు వెనకడుగు వేశాయి. ఇప్పుడు అమెరికా ఆంక్షల భయం తగ్గడంతో, రూపాయి–రూబుల్ వాణిజ్యం మరింత బలోపేతం కావచ్చు.రష్యాతో చమురు వాణిజ్యం పునరుద్ధరించబడటానికి ఇది సువర్ణావకాశం అయినప్పటికీ అమెరికా సుప్రీంకోర్టు తీర్పు భారత్‌కు ఒక "న్యాయపరమైన కవచం" లాంటిది మాత్రమే. కేవలం న్యాయస్థానాల ద్వారానే కాకుండా, భారత్ తన దౌత్య నీతిని వాడుకుని అమెరికాను ఒప్పించాల్సి ఉంటుంది. ఎందుకంటే ట్రంప్ 'చట్టం' కంటే 'ఒప్పందాల'కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఆయన ప్రతిస్పందించిన తీరే ఇందుకు నిదర్శనం. తీర్పుపై ట్రంప్ తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ చట్టాల ద్వారా 10% నుండి 15% వరకు వివిధ దేశాలపై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. 'రెసిప్రోకల్ ట్రేడ్ యాక్ట్' వంటి ఇతర మార్గాల ద్వారా పరోక్షంగా సుంకాలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. "అమెరికాను రక్షించుకోవాలి, కోర్టులు ఏమన్నా సరే నేను వెనక్కి తగ్గను" అన్నది ఆయన వాదన. ఇది అమెరికా లోపల ఒక పెద్ద రాజకీయ సంక్షోభానికి దారితీసేలా ఉంది. ఎందుకంటే కొన్ని రాష్ట్రాలు, చాలా కంపెనీలు ట్రంప్ సుంకాల వల్ల తాము ఆర్థికంగా చాలా నష్టపోతున్నామని భావిస్తున్నాయి. అవి ట్రంప్ వైఖరిని గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఈ తీర్పు కంపెనీలకు కొన్ని ఆసక్తికరమైన న్యాయపరమైన వెసులుబాట్లు ఇచ్చింది. పూర్తి వస్తువుపై సుంకం ఉన్నా, వాటిని విడిభాగాలుగా దిగుమతి చేసుకుని అమెరికాలో వస్తువుగా జోడించడం ద్వారా సుంకాలను తప్పించుకోవచ్చు. దీనిని అడ్డుకునే అధికారం ఇప్పుడు అధ్యక్షుడికి లేదు. చైనా వస్తువులు భారత్ మీదుగా 'మేడ్ ఇన్ ఇండియా' ముద్రతో అమెరికా చేరడం ఇంకా పెరగవచ్చు. ఇది ఒక పెద్ద వ్యాపారంగా మారడంతో పాటు భారత్ ఓడరేవుల ఆదాయాన్ని పెంచుతుంది. ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవు అని తీర్పు వచ్చింది కాబట్టి ఇప్పటికే అధికంగా వసూలు చేసిన సుంకాల మాటేమిటి అన్న ప్రశ్న మొదలయింది. సుమారు 200 బిలియన్ల డాలర్ల అదనపు సుంకాలను కంపెనీలకు తిరిగి చెల్లించాల్సి రావడం అమెరికా ఖజానాకు ఒక సవాలు. ఇది అంత సులువు కాదు. దీనిపైనా ఇప్పటికే కొన్ని సంస్థలు మళ్లీ కోర్టు గుమ్మం తొక్కాయి.

వాస్తవానికి ట్రంప్ తీరు అమెరికా రాజకీయ వ్యవస్థలోనూ పెను ప్రకంపనలు సృష్టించింది. ఓ పక్క ఆయన కెనడాను కలిపేసుకుంటాం, గ్రీన్లాండ్‌ను ఆక్రమించుకుంటాం అని దూకుడుగా మాట్లాడుతుంటే మరోపక్క అమెరికాలో సమాఖ్యలో భాగమైన రాష్ట్రాలు తిరుగుబాటు ప్రకటిస్తున్నాయి. కాలిఫోర్నియా, న్యూయార్క్ వంటి రాష్ట్రాలు ఫెడరల్ సుంకాలను లెక్కచేయకుండా, భారత్ వంటి దేశాలతో స్వతంత్ర వాణిజ్య చర్చలు జరపడం ఒక విశేష పరిణామం. అమెరికాలో ప్రస్తుతం ఉన్న ఈ చట్టపరమైన గందరగోళం భారత్‌కు ఒక అరుదైన అవకాశం. భారతదేశంపై ఈ తీర్పు సానుకూల ప్రభావాన్ని చూపుతోంది. ముఖ్యంగా ఐటీ సేవలు, ఫార్మాస్యూటికల్స్, వస్త్ర పరిశ్రమలకు ఇది ఊపిరి పోసింది. ట్రంప్ సుంకాల వల్ల గత రెండేళ్లలో భారత ఎగుమతులు 12% తగ్గాయి. ఇప్పుడు ఆ సుంకాలు రద్దయితే, భారతీయ వస్తువులు అమెరికా మార్కెట్‌లో తిరిగి పోటీ పడగలవు. ట్రంప్ తన దూకుడు తగ్గించకపోయినా, అమెరికా సుప్రీంకోర్టు మనకు మంచి వెసులుబాటు కల్పించింది. భారత్ ఇప్పుడు కేవలం వస్తువులను ఎగుమతి చేయడంపైనే కాకుండా, అమెరికాలోని వివిధ రాష్ట్రాలతో నేరుగా ఒప్పందాలు చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. అధికారిక చర్చలకు సమాంతరంగా వాషింగ్టన్, ఢిల్లీ మధ్య గట్టిగా 'బ్యాక్ ఛానల్' చర్చలు నడుస్తున్నాయి. అమెరికా తన రక్షణ ఉత్పత్తులను భారత్‌కు అమ్మేందుకు, ఈ టారిఫ్ ఉపశమనాన్ని ఒక ఆయుధంగా వాడుకోవాలని చూస్తోంది. చైనాను కట్టడి చేసేందుకు భారత్‌తో దోస్తీ అవసరమని ట్రంప్ టీమ్‌లోని ఒక వర్గం భావిస్తోంది. అవకాశాలు అరుదుగా వస్తుంటాయి. భారత్ ఈ అవకాశాన్ని జాగ్రత్తగా దేశ ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా మలచుకోవాలి.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# శ్రీసిటీ లాంటివి దేశమంతా రావాలి!

సుమారు రెండు దశాబ్దాల క్రితం పురుడుపోసుకున్న శ్రీసిటీ దిన దిన ప్రవర్ధమానమై వర్ధిల్లుతోంది. కేవలం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా దేశ పారిశ్రామిక రంగానికే ఆదర్శంగా ప్రగతిపథంలో దూసుకుపోతోంది. 31దేశాలకి చెందిన 240 పరిశ్రమలతో 68వేల మందికి ఉపాధి కల్పించడం మన 'లాయర్'లో రాసినట్లుగా అనితరసాధ్యం, అనన్య సామాన్యం. లక్షమందికి జీవనోపాధి కల్పించాలన్న శ్రీసిటీ నిర్వాహకుల లక్ష్యం అద్భుతం, అభినందనీయం. ఘనమైన పారిశ్రామిక అభివృద్ధికి సాక్షిగా, నిజమైన ఉపాధి కల్పనకి కొలమానంగా శ్రీసిటీ ఎదుగుతోంది. చిత్తశుద్ధి, అంకితభావంతో కృషిచేస్తే 20 సంవత్సరాల కాలంలో ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో అని చెప్పడానికి శ్రీసిటీ ఒక పెద్ద ఉదాహరణ. శ్రీసిటీ యాజమాన్యానికి, ముఖ్యంగా అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్న సంస్థ సారధి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి గారికీ నా శతకోటి వందనాలు. కొత్తగా ప్రపంచ ప్రఖ్యాత క్యారియర్ ఉత్పత్తుల కర్మాగారం శ్రీసిటీలో రాబోతున్న తరుణంలో నా శుభాకాంక్షలు!

– లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

# విద్యాసంస్థలు లక్ష్యంగా గంజాయి ముఠాలు!

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో గంజాయి ముఠాలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నాయి. ముఖ్యంగా విద్యాసంస్థల చుట్టుపక్కలే ఈ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నాయని వార్తలు వస్తున్నాయి. కళాశాలలతో పాటు పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు సైతం గంజాయి మత్తుకి బానిసలైపోతున్నట్లు అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయి. అక్కడక్కడా వెలుగు చూస్తున్న సంఘటనలతో రెండు తెలుగు రాష్ట్రాలలోని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. అభం శుభం తెలియని తమ బిడ్డలని ఈ గంజాయి ముఠాలు లోబరుచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహానగరాలతో పాటు చిన్నచిన్న పట్టణాలలో సైతం ఈ గంజాయి గ్యాంగులు రెచ్చిపోతున్నాయి. ప్రభుత్వ అధినేతలు, అధికారులు, పోలీసుశాఖ ఈ విషయంపై దృష్టిపెట్టాలి. విద్యాసంస్థల ప్రాంగణాలని గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల కేంద్రాలుగా మారుస్తున్న అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలి. విద్యాసంస్థల వైపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడేలా వారిపై చర్యలు తీసుకోవాలి!

– డి.హరిత, గూడూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# కొండాయపాళెం రోడ్డు విస్తరించాలి!

నెల్లూరు నగరంలోని అన్నమయ్య కూడలి నుండి జాతీయ రహదారి వరకూ వెళ్ళే కొండాయపాళెం రోడ్డుని విస్తరింపచేయాలి. ముఖ్యంగా చెన్నై, బెంగళూరు, తిరుపతి వైపు నుండి వచ్చే వాహనాలు నగరంలోకి రావడానికి కొండాయపాళెం మార్గం అతికీలకంగా మారింది. అంతేకాకుండా కనుపర్తిపాడు, గొలగమూడి వైపు కూడా నెల్లూరునగరం విస్తరించుకుంటుంది. ముఖ్యంగా జాతీయ రహదారిపైన గొలగమూడి కూడలి వద్ద నిర్మితమవుతున్న ఫ్లైఓవర్ పూర్తయితే కనుపర్తిపాడు నుండి గొలగమూడి వరకు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారూ, రూరల్ నియోజకవర్గాన్ని ప్రగతిలో పరుగులు పెట్టిస్తున్న స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారూ ఈ మార్గంపై దృష్టి పెట్టాలి. అన్నమయ్య బొమ్మ నుండి జాతీయ రహదారి వరకు చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు తరహాలో సెంట్రల్ డివైడర్‌తో వెడల్పుచేయాలి.

ఆర్.పి.రామయ్య, కొండాయపాళెం.

# ప్రేమ-శాంతి- దాతృత్వంతో రంజాన్ పండుగ

### వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్



అబ్బాస్ అలీఖాన్ మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్

ప్రేమ–శాంతి– దాతృత్వంతో రంజాన్ పండుగ జరుగుతుందని, పేదవాడి ఆకలి విలువ తెలుసుకోవాలనేదే ఈ పండుగ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని చిన్నబజారులో ఉన్న అబ్బాస్ అలీఖాన్ మసీదులో ఇటీవల జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఎంతో పవిత్రమైన ఈ మసీదుకు 400 సంవత్సరాల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ మసీదుకు అనేక ఆస్తులు ఉన్నాయని, వాటి పరిరక్షణకి నూతనంగా కమిటీని నియమించామని చెప్పారు. ఆ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. కులమతాలకు అతీతంగా యావత్ ప్రపంచం సుఖశాంతులతో వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థించామని అజీజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మైనార్టీ ప్రముఖులు కరిముల్లా, సాబీర్ ఖాన్, సమీ హుసేని, ఇంతియాజ్, రియాజ్, అన్వర్, హయాద్ బాబా, పాషా మొహిదీన్, కాలేశా తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ చొరవతో ఒకేరోజు..

# 26 మందికి ఉద్యోగోన్నతులు

• రెవెన్యూ సిబ్బందిలో హర్షం



రెవెన్యూ సిబ్బందికి నియామకపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జిల్లాస్థాయిలో ఒకేరోజు 26 మంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇటీవల నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రికార్డు సృష్టించారు. దీంతో రెవెన్యూ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సీనియర్ అసిస్టెంట్ నుండి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా ఎనిమిది మంది, గ్రేడ్ 1.. గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి సీనియర్ అసిస్టెంట్ హోదాకు 18 మంది.. మొత్తం 26మంది రెవెన్యూ సిబ్బందికి ఒకేరోజు రికార్డు స్థాయిలో పదోన్నతి కల్పించారు. వెంకటాచలంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.తనుజను టి.పి.గూడూరులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. అదేవిధంగా ఆత్మకూరులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.పెంచలయ్యను మర్రిపాడులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌కే. ఫిరోజ్‌ను నెల్లూరులోని స్పెషల్ తహసీల్దార్(ఎల్.ఎ.), కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. స్పెషల్ కలెక్టర్(టి.జి.పి.), నెల్లూరులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌కే. సైరా భానును నెల్లూరులో స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, అల్లూరులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. నెల్లూరు డీఎస్‌ఓ కార్యాలయంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వై. వంశీ కృష్ణను తహసీల్దార్ కార్యాలయం, అల్లూరులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.మోహనరూపను వింజమూరులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. డీఎస్‌ఓ కార్యాలయం-నెల్లూరులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వై.వంశీ కృష్ణను తహశీల్దార్ కార్యాలయం, అల్లూరులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.మోహన రూపను వింజమూరులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఉద్యోగోన్నతులు పొందిన వారందరూ సమర్థవంతంగా పనిచేస్తూ..జిల్లాను ప్రగతి పథంలో నిలపాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# డీఆర్ఓ ఆధ్వర్యంలో.. పరిసరాల పరిశుభ్రత

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద డీఆర్ఓ ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. డీఆర్ఓ విజయకుమార్ తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారాన్నంతా పరిశుభ్రం చేశారు. కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి విజయకుమార్, వివిధ శాఖల అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రోబోటిక్ సైనికులు యుద్ధాలు చేసే రోజులొస్తాయి

## భవిష్యత్తులో ఏఐ లేని వ్యవస్థ.. ఏదీ ఉండదు!



డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్ డా. సతీష్‌రెడ్డి

భవిష్యత్తులో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) లేని వ్యవస్థ ఏదీ ఉండదని, ఏఐతో అనుసంధానం కాని ఆయుధం.. పాత ఇనుముతో సమానమని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, జాతీయ భద్రతా మండలి సభ్యులు, ఏపీ ఏరో డిఫెన్స్ అడ్వయిజర్ డా.జి.సతీష్‌రెడ్డి చెప్పారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ యుద్ధ రంగం ఏ విధంగా మారబోతుందో ఆయన వివరించారు. భారతీయ యువత ఏఐ రంగాన్ని శాసించబోతోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఇకపై కేవలం ప్రయోగశాలలకో లేదా సైన్స్ ఫిక్షన్ సినిమాలకో పరిమితం కాదని, అది ఆధునిక రక్షణ వ్యవస్థలకు వెన్నెముకగా మారుతోందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతికత మారుతున్న వేగాన్నిబట్టి చూస్తే భవిష్యత్తులో ఏఐ లేని వ్యవస్థ అంటూ ఏదీ ఉండదని అర్థమవుతోందన్నారు. సివిల్ రంగంలో అయినా రక్షణ రంగంలో అయినా సరే.. ఏఐని జోడించకుండా ఏ ఉత్పత్తిని తయారు చేసినా అది మార్కెట్లో పనికిరాని వస్తువుగానే మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు. స్మార్ట్‌ఫోన్ల నుంచి మొదలు కార్లు, యుద్ధ విమానాలు, క్షిపణులు మరియు రక్షణ వాహనాలు ఇలా ప్రతి రంగాన్ని ఏఐ ప్రభావితం చేయబోతుందని ఆయన వెల్లడించారు.

భారత సరిహద్దుల్లో రోబోటిక్ సైనికుల మోహరింపుపై ఆయన ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాము ఇప్పటికే క్వాడ్రపెడ్(నాలుగు కాళ్ల) రోబోలను ఉపయోగిస్తున్నామని, రెండు కాళ్లపై నడిచే బైపెడల్ ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఆయన తెలిపారు. హ్యూమనాయిడ్ రోబోలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన మరుక్షణమే వాటిని రోబోటిక్ సైనికులుగా మార్చడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. డ్రైవర్ లేని కార్లలానే భవిష్యత్తులో స్వీయ నియంత్రణ కలిగిన ఆయుధాలు వాస్తవ రూపం దాలుస్తాయన్నారు.

### జొన్నవాడ దేవాలయానికి..

# వింజామర వితరణ



జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో స్వామివార్ల నిత్య ఆర్జిత సేవల్లో ఉపయోగించేందుకు ఇటీవల పొదలకూరుకు చెందిన శ్రీ కర్ణం కామాక్షి ఆర్య పేరున శ్రీ కర్ణం కామాక్షి కార్తిక్ 94 గ్రాముల వెండి వింజామరను సమర్పించుకున్నారు. ఆ వింజామరను ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

### కంప్యూటర్ బహూకరణ :



జొన్నవాడ దేవాలయంలో నిత్య అన్నదానం టికెట్ కౌంటర్ నిర్వహణ కోసం ఎన్‌డిసిసి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి సూరపనేని శ్రీనివాసరావు ఇటీవల ఒక కంప్యూటర్‌ను బహూకరించారు. దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డికి దానిని అందజేశారు. నెల్లూరు జనరల్ మేనేజర్ వై.సరిత, పొదలకూరు బ్రాంచ్ సహాయ జనరల్ మేనేజర్ శనగవరపు శ్రీనివాస భగవాన్ పాల్గొన్నారు.

### మాతృభాష..

# అమృతంతో సమానం

### మాడభూషి సంపత్‌కుమార్




కార్యక్రమంలో మాట్లాడుతున్న మాడభూషి సంపత్‌కుమార్

మాతృభాష అమృత తుల్యమైనదని, దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు..ప్రముఖ సాహితీవేత్త మాడభూషి సంపత్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాతృభాష మానవ మనుగడకు జీవమని, భాష లేనిదే ఏ భావాన్ని ప్రకటించలేమంటూ భాషా ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. ప్రముఖ కవులు- రచయితలు అల్లు భాస్కర్‌రెడ్డి, గుండాల నరేంద్రబాబు, బొగ్గరపు కృష్ణమూర్తి, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుజా షామిలి మాట్లాడుతూ మాతృభాషలో మాట్లాడడం వల్ల మేధస్సు వికసిస్తుందని, ఇతర భాషల మోజులో పడి తెలుగు భాషను మరువవద్దని సూచించారు. ప్రతిఒక్కరూ మాతృభాషను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వక్తలను నిర్వాహకులు సన్మానించారు.

### 'చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో..

# నలుగురికి అవార్డులు

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, ఆడిటర్ ఆధ్వర్యంలోని 'చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్' వారు 2026వ సంవత్సరానికి తమ ఫౌండేషన్ తరఫున సారస్వత, పాత్రికేయ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్నవారికి ఇటీవల అవార్డులను ప్రకటించారు. ప్రధాన అవార్డును హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సాహితీవేత్త.. కొప్పర్తి వెంకటరమణ మూర్తికి ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా, మరో మూడు అవార్డులకు వరుసగా పిడుగురాళ్లకు చెందిన ప్రముఖ కవి రచయిత.. వైవెచ్‌కె మోహన్‌రావు (సత్యవేటి శ్రీకాంత్ స్మారక పురస్కారం), నెల్లూరుకి చెందిన కవి.. సీనియర్ పాత్రికేయుడు మద్దూరు శ్రీనివాసులు (స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి స్మారక అవార్డు), చిలకలూరిపేటకి చెందిన కవయిత్రి గంగవరపు సునీత (నాగభైరవ కోటేశ్వరరావు స్మారక అవార్డు)లు ఆయా అవార్డులకి ఎంపికయినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. త్వరలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమంలో అవార్డు గ్రహీతలకు సన్మానాలతో పాటు నగదు బహుమతులను కూడా అందజేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిన్ని నారాయణరావు, గౌరవ సలహాదారు కలిమిశ్రీ తెలియజేశారు.


## రెడ్డి వృద్ధాశ్రమం

## REDDY OLD AGE HOME

27/1/14, 3వ వీధి - రాంజీనగర్ (చిల్డ్రన్స్ పార్కు సాయిబాబా గుడి ఎదురు వీధి), నెల్లూరు.

చేరదలచిన వారు సంప్రదించండి. ఖాళీలు ఉన్నాయి.

బిరుదవోలు వెంకటరెడ్డి
ఛైర్మెన్, వృద్ధాశ్రమం కమిటీ, సెల్:98850 99885

అన్నెం సుధాకర్‌రెడ్డి
వైస్‌ఛైర్మెన్, సెల్: 94410 84401

అనుమారెడ్డి శరత్‌రెడ్డి
కమిటీ సభ్యులు, సెల్: 93473 55075

తూపిలి శ్రీధర్‌రెడ్డి
కమిటీ సభ్యులు, సెల్ : 98666 48284

శ్రీమతి ఇ.ధనుజారెడ్డి
కమిటీ సభ్యురాలు, సెల్: 96769 82625

# ముస్లిం సోదరులకు అండగా ప్రభుత్వం

## మంత్రి నారాయణ సతీమణి రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న పొంగూరు రమాదేవి

పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకుని, నెల్లూరులోని గోమతి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఇటీవల ముస్లిం మైనార్టీ నేతలు మరియు మత పెద్దలతో గౌరవపూర్వకంగా సమావేశమయ్యారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరుల కోసం చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలు, మైనార్టీల సంక్షేమం మరియు భవిష్యత్ కార్యాచరణపై ఆమె సుదీర్ఘంగా చర్చించారు. మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. ముస్లిమ్ సోదరులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేదురుమల్లి సేవలు అపారం



నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి 91వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 20న స్థానిక ఇందిరాభవన్‌లో నేదురుమల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కాంగ్రెస్ నేతగా, మహోన్నత వ్యక్తిగా జనార్దన్‌రెడ్డి పేరొందారని, రాష్ట్రప్రజలకు అపారమైన సేవలందించారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీలకి అతీతంగా, నెల్లూరు నగరంలో జనార్దన్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు.

# రెడ్‌క్రాస్‌లో రక్తదానం




రక్తదానం చేస్తున్న దాసరి రాజేంద్రప్రసాద్, ఫిజియోథెరపీ సిబ్బంది

నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ-జిల్లాశాఖ బ్లడ్ బ్యాంక్‌లో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, స్పాస్టిక్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ ఏటా నాలుగుసార్లు రక్తదానం చేయడంలో భాగంగా, ఈ ఏడాది మొదటి విడతగా ఈనెల 20న 56వసారి స్వచ్ఛం దంగా రక్తదానం చేశారు. ఆయనతో పాటు స్పాస్టిక్ సెంటర్ ఫిజియో థెరపీ సిబ్బంది కూడా రక్తదానం చేశారు. బ్లడ్‌బ్యాంక్ కోఆర్డినేటర్ జయ్య ప్రసాద్ రక్తదాతలను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

# నెల్లూరు కబుర్లు

## జనగణన సర్వేని సక్రమంగా చేయాలి




కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాధారణ కోవిడ్, కుటుంబ వంటి సర్వేల కన్నా జనగణన-2027 సర్వే రాజ్యాంగబద్ధమైనదని, దానిని క్రమపద్ధతిలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ హిమాన్షు శుక్లా అన్నారు. మంగళవారం స్థానిక హరనాథ పురంలోని నారాయణ ఇంజనీరింగ్ కళా శాల సెమినార్ హాలులో ఈనెల 24 నుండి 26వతేదీ వరకు జిల్లా అధికారులకు నిర్వ హిస్తున్న శిక్షణ తరగతుల కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. 2011లో జరిగిన జన గణన సమయంలో తాను ప్రయివేటు ఉద్యోగంలో ఉంటూ, తొలిసారి జన గణనలో పాల్గొన్నానని ఆయన చెప్పారు. జనగణన వల్ల ప్రభుత్వ స్కీములు అందవనే అపోహ ప్రజలలో ఉందని, ఇది కేవలం జనగణన మాత్రమే అని, దీని వల్ల ప్రభుత్వ పథకాలు అందవనే ఆపోహ అవసం లేదన్నారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవిన్యూ అధికారి విజయకుమార్, జనగణన సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నగరాన్ని హరితవనం చేస్తాం



మొక్కలు నాటుతున్న రూప్‌కుమార్

రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పి.నారాయణ ఆలోచనల మేరకు నెల్లూరు నగరాన్ని పచ్చ దనంతో హరితవనంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఇటీవల ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్‌తో కలిసి స్థానిక 50వ డివిజన్ సంతపేట పేరం టాలమ్మ గుడి సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 5న జరిగే రంగనాయకుల పేట తల్పగిరి రంగనాథ స్వామి రథోత్సవం సందర్భంగా రథం తిరిగే రోడ్లపై ఎలాంటి గుంతలు లేకుండా అన్ని ప్రాంతాలలో 5 లక్షల రూపాయలతో ప్యాచ్‌వర్క్ పనులు చేయిస్తున్నామన్నారు. డివిజన్ వ్యాప్తంగా పచ్చదనం పెంచడం కోసం 10 లక్షల రూపాయలతో మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతలు కూడా చేపడుతున్నామన్నారు.

## మూఢనమ్మకాలు వద్దు

మూఢ నమ్మకాలు వద్దనే వద్దని, ముఖ్యంగా విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడాలని జనవిజ్ఞానవేదిక (జేవీవీ) ఆరోగ్య సబ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. ఈనెల 24న నెల్లూరులోని సాంఘికసంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులంతా శాస్త్రీయ ఆలోచనలతో రాణించాలని, తద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి సిహెచ్ కృష్ణ, నగర కోశాధికారి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్వర్ణాంధ్ర' క్యాలెండర్ల ఆవిష్కరణ

వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాచార ప్రజాసంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన "స్వర్ణాంధ్ర-2047" క్యాలెండర్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈనెల 23న ఆవిష్కరించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం పేదరిక నిర్మూలన, ఉపాధి ఉద్యోగ కల్పన, నైపుణ్యం - మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయంలో సాంకేతికత, ప్రపంచ స్థాయి రవాణా, స్వచ్ఛ ఆంధ్ర అన్ని దశల్లో సమగ్ర సాంకేతి కత మొదలైన 10 సూత్రాలతో విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. ఈ క్యాలెండర్లను జిల్లా, మండల స్థాయి కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు పంపిణీ చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

# మొదలైన రంగనాథుని బ్రహ్మోత్సవాలు

**3న గరుడసేవ**
**4న కల్యాణం**
**5న రథోత్సవం**



నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామివారి దేవస్థానంలో ఈనెల 26న స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 8వ తేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా, 27వ తేదీ ధ్వజారోహణం (తిరుచ్చి), రాత్రి శేషవాహనోత్సవం నిర్వహించనున్నారు. 28న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి హంసవాహనోత్సవం ఉంటాయి. మార్చి 1న సింహ వాహనం, చంద్రప్రభ, 2న పల్లకి (వెణ్ణత్తాళి), హనుమంతసేవ, 3న మోహినీ అవతారం, రాత్రి స్వామివారికి వైభవోపేతంగా బంగారు గరుడసేవ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు పూలంగిసేవ ఉంటుంది. మార్చి4 ఉదయం పూలంగిసేవ, సాయంత్రం కల్యాణో త్సవం, రాత్రికి గజవాహనసేవ జరుగుతాయి. 5వ తేది గురువారం ఉదయం 8.30 గంటల నుంచి అంగరంగవైభవంగా రంగనాథుని రథోత్సవం భక్తులకు కన్నులపండుగ చేస్తుంది. అదేరోజున శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి పుష్పాలంకారం, రాత్రి పొన్న వాహనోత్సవం నేత్రపర్వంగా ఉంటాయి. 6న మధ్యాహ్నం తిరుప్పావ్‌న్దాడల్, సాయంత్రం తెప్పోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి అశ్వవాహనోత్సవం జరుగుతుంది. 7వ తేది ఉదయం ప్రణయకలహోత్సవం(ముసుగుల సేవ), చక్రస్నానం, తీర్థవారి ఉత్సవాలు ఉంటాయి. సాయంత్రం పుణ్య కోటి విమానం, 8వ తేదీ సాయంత్రం పుష్పయాగం, రాత్రి దవనోత్సవం, అనంతరం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

# ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి..టీచర్ల వినతి



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్ఆర్‌టీపీ నేతలు

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఏపీ వైఎస్ఆర్‌టీపీ నాయకులు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. పీఆర్‌సీ అమలుకు కమిటీ ఏర్పాటుచేయాలని, ఉపాధ్యాయులకు 30 శాతానికి తగ్గకుండా ఐఆర్‌ని ప్రకటించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసే దిశగా శాసనమండలిలో తమ సమస్యలపై చర్చించాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునీర్‌జాన్, రాష్ట్ర అధికార ప్రతినిధి రఘురామిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## తెలుగు భాషపై..

# విద్యార్థులకు నెరసం పోటీలు



విజేతలకు బహుమతులందజేస్తున్న నెరసం నిర్వాహకులు

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 23న నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో విద్యార్థులకు నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో తెలుగు భాష ఔన్నత్యం గురించి వివరించారు. తెలుగు భాషా వికాసంపై విద్యార్థులకు కవి సమ్మేళనం, ఉపన్యాస పోటీలను నిర్వహించి బహుమతులందజేశారు. కవిసమ్మేళనంలో ప్రథమ బహుమతి సమీక్ష, ద్వితీయ బహుమతి పొందిన శ్వేత శేఖర్ తదితరులను అభినందించారు. నెరసం కార్యదర్శి డా. పాతూరి అన్నపూర్ణ, అధ్యక్షులు ఎ.జయప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ రే గిన్నాల్, డీన్ నువ్వుల శివకుమార్, ప్రొఫెసర్ కన్నన్‌లతో పాటు కవులు ఎ.భారతి, అరుణ సండడి, సయ్యద్ నజ్మా షమ్మీ పాల్గొన్నారు. సి.వాసవి వందన సమర్పణ చేశారు.




# వైసీపీ సభ్యుల తీరు దారుణం

## • ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి చిత్రపటాలను వైసీపీ సభ్యులు రాజకీయ చర్చల సభలోకి తేవడం, ఆ సమయంలో చెప్పులు ధరించడం ఘోర అపచారమని, వైసీపీ హయాంలో టీటీడీ విషయంలోను,..స్వామివారికి సంబంధించిన పలు అంశాల్లోనూ వారు వ్యవహరించిన తీరు దారుణమని శాసన మండలి సభ్యులు, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రత, విశిష్టత, భక్తుల నమ్మకం, విశ్వాసాలపై రాజకీయ వివాదాలకు, చర్చకు అవకాశం ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించుకుందని, అయితే.. సంబంధం లేని అంశాలను వైసీపీ సభ్యులు సభలోకి తెచ్చి వివాదాలు సృష్టిస్తున్నారని ఆయనన్నారు. ఇటీవల నెల్లూరు నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో, కూటమి పార్టీల నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ హయాంలో తిరుమలలో వివాదం కాని అంశమే లేదన్నారు. హిందూ మతంపై గౌరవం, శ్రీ వెంకటేశ్వరస్వామి వారిపై నమ్మకం, విశ్వాసం ఏ మాత్రం ఉన్నా జగన్, వైఎస్ఆర్సీపీ సభ్యులు రాష్ట్ర ప్రజలకు, భక్తులకు క్షమాపణ చెప్పాలన్నారు. టీటీడీ బోర్డు సభ్యురాలు, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు వంశీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్‌యాదవ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి ఆంజనేయ రెడ్డి, భరత్, మల్లికార్జున యాదవ్, సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా..

# గ్రామాల అభివృద్ధి

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



3ఫేజ్ కరెంట్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు

ఎన్నికలు లేని వేళ, పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా అందరం కలసి కృషిచేద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొత్తవెల్లంటి గ్రామంలో 2 కోట్ల 17 లక్షల రూపాయలతో 3 ఫేజ్ 24 గంటల కరెంటు సరఫరాకి అవసరమైన పనులను, పాతవెల్లంటి గ్రామంలో 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోనే 3 ఫేజ్ 24 గంటల కరెంటు పనులను పూర్తిచేసిన మొట్టమొదటి నియోజకవర్గం నెల్లూరురూరల్ నియోజకవర్గమేనన్నారు. గ్రామాల్లో ఎలాంటి తగాదాలకు తావులేకుండా, అందరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నెల్లూరు ఏ.ఎం.సి. ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

### వీఆర్‌సీతో నాకెంతో అనుబంధం - శ్రీధర్‌రెడ్డి

నెల్లూరులోని వీఆర్ కళాశాలతో తనకెంతో అనుబంధం ఉందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన 1983–1986 బ్యాచ్ వీఆర్ కళాశాల పూర్వ విద్యార్థిని విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడుతూ, తాను వీఆర్‌సీలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో వీఆర్‌సీలో తాను నేర్చుకున్న రాజకీయపాఠాలు, పోరాటాలే నేడు జిల్లాలో ఉండే పెద్దపెద్ద రాజకీయ కుటుంబాలని ఎదిరించి నన్ను నిలబెట్టాయన్నారు. వీఆర్‌సితో తనకున్న బంధం, విద్యార్థులతో ఉన్న సాహచర్యాన్ని ఆయన వివరించారు.

# శ్రీసిటీ ప్రగతి భేష్!

## మాజీ డీజీపీ డా. మాలకొండయ్య



మాజీ డీజీపీ డా. మాలకొండయ్యను సత్కరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

పారిశ్రామికరంగంలో శ్రీసిటీ విజన్, ప్రణాళిక, అమలు తీరు ప్రశంసనీయమని రాష్ట్ర మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డా. మాలకొండయ్య అభినందించారు. దేశంలో ఆదర్శ పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ నిలుస్తుందన్నారు. ఇటీవల ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా.. ముఖ్యంగా స్థానికులకు, మహిళలకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు డా. రవీంద్ర సన్నారెడ్డిని, వారి బృందాన్ని అభినందించారు. స్థిరమైన అభివృద్ధి చర్యలు, సిఎస్ఆర్ కార్యక్రమాలు ఇక్కడ సమర్థవంతంగా అమలవుతున్నాయని కొనియాడారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన పారిశ్రామిక కేంద్రంగా మలచడం అభినందనీయమని తెలిపారు. తన సందర్శనలో భాగంగా ఆయన ఇసుజు, మోండెలీజ్, బ్లూస్టార్ ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించి, సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. అలాగే క్రియా యూనివర్సిటీ, చిన్మయ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. డా. మాలకొండయ్యను శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ బివి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీసిటీ ప్రాంతంలో అమలవుతున్న భద్రతా చర్యలు మరియు శాంతి భద్రతల పరిస్థితులను వివరించారు.

# తండ్రి ఆశయాల బాటలో తనయులు

## • రక్తదానం చేసిన.. నేదురుమల్లి కుమారులు



తండ్రి చూపిన సేవామార్గంలో పయనిస్తూ, ఆయన ఆశయాల బాటలో నడుస్తూ ఆ తనయులు అందరినీ ఆకట్టుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 91వ జయంతి సందర్భంగా ఈనెల 20న కోట మండలం విద్యానగర్‌లో జరిగిన సేవా కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి తనయులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లి గౌతంరెడ్డిలు పాల్గొని, తండ్రిని స్మరించుకుంటూ రక్తదానం చేశారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని, యువతకు రక్తదానం విశిష్టతను తెలియజేశారు. తొలుత తమ తండ్రి జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. ఈ రక్తదాన శిబిరంలో నేదురుమల్లి కుటుంబ సన్నిహితులు, బంధువులు, ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బందితో పాటు యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు, గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది వచ్చి, మొత్తం 682 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. కోడూరు మీరారెడ్డి, కోడూరు కల్పలత, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, కొడవలూరు భక్తవత్సలరెడ్డి, ఎన్‌బీకేఆర్ డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని 'పెద్దాయన' స్మృతికి నీరాజనాలర్పించారు.

నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జయంతి సందర్భంగా తొలుత, వెంకటగిరి పట్టణంలోని త్రిభువని సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి అభిమానులు, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు. వందలాది మంది పాల్గొని పెద్దాయనకి నివాళులర్పించారు. వెంకటగిరి మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలయ్య, నాయకులు పాదిలేటి దశరథరామిరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.




90వ పుట్టినరోజు శుభాకాంక్షలు



స్ఫూర్తిప్రదాత, మార్గనిర్దేశకులు, సేవాతత్పరులు
శ్రీ వరిగొండ మస్తానయ్య గారు
(Rtd., M.D.O, Nellore)
90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా
పుట్టినరోజు శుభాకాంక్షలు.
నాన్న గారితో మీ సుదీర్ఘకాల స్నేహబంధం
మాకు ఎంతో ఆదర్శనీయం.
మీ భావిజీవితం అష్టైశ్వర్య ఆయురారోగ్యాలతో
వర్ధిల్లాలని మనసారా ఆశిస్తూ...
దావులూరు జగదీష్‌బాబు
దావులూరు రమాదేవి

# ఎన్‌బికెఆర్ ఐఎస్‌టితో జపాన్ సంస్థ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న జపాన్ కంపెనీ ప్రతినిధులు, కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట మండలం, విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 24వ తేదీ జపాన్ సంస్థ మెడిన్‌షా కార్పొరేషన్ సంస్థతో సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్య బదలాయింపు కొరకు అవగాహనా ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమానికి మెడిన్‌షా కార్పొరేషన్ డైరెక్టర్ టకాయుకి శానో, ఎం.డి వకాయి శానో, ప్లాంట్ హెడ్ రమేష్ చంద్రసింగ్, హెచ్‌ఆర్ భూమికా లెగా, తదితర ప్రతినిధులు హాజరయ్యారు. జపాన్ కంపెనీ యొక్క నైపుణ్యాలపై ఇక్కడి ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి, కంపెనీ డైరెక్టర్, ఎం.డిలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ ఎం.డి వకాయి శానో మాట్లాడుతూ గత సంవత్సరంలో కంపెనీకి ఎంపికైన ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులు చక్కగా నైపుణ్యాలు నేర్చుకుని ఉద్యోగాలు చేస్తున్నారని అభినందించారు. కంపెనీ డైరెక్టర్ టకాయుకి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను బట్టి భవిష్యత్‌లో ఈ కంపెనీ ద్వారా ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలలో ఎన్నో ఇంటర్న్‌షిప్ మరియు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మెడిన్‌షా కంపెనీ తమ కళాశాలను ఎంచుకుని విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పూర్తి సహకారాన్ని అందిస్తున్నందుకు జపాన్ సంస్థ ప్రతినిధులను అభినందించారు.

# ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఛత్రపతి శివాజీ మహారాజ్ 397వ జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు ట్రంక్‌రోడ్డు శివాజీ సెంటర్‌లో మరాఠా మిత్రమండలి కుటుంబ సభ్యులు - శివాజీ సెంటర్ మిత్రమండలి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సురేందర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు వేలూరు మహేష్, పొట్లూరి రామకృష్ణలు పాల్గొని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత, స్థానిక సంతపేట స్వామి వివేకానంద విగ్రహం వద్ద నుంచి చత్రపతిశివాజీ మహారాజ్ విగ్రహం వరకు మరాఠా మిత్రమండలి కుటుంబసభ్యులు ర్యాలీ చేపట్టి శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మరాఠా మిత్రమండలి నాయకులు దేవదాస్, బలరాం, శివాజీ సెంటర్ నాయకులు కేవి సుబ్రహ్మణ్యం, బివిఎస్ రంగరాజన్, పి. భాస్కరరావు, అలిమిలి శ్రీహరి, వి.హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వికాసం కోసం..'లైఫ్ లాడర్'

## పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ రచయిత యండమూరి



'మానసిక వికాసం' అనే అంశంపై మన నెల్లూరీయుడు, 'గెటప్' మురళీ తనయుడు, సైకాలజిస్ట్ అభిషేక్ శింగంశెట్టి రచించిన "లైఫ్ లాడర్" పుస్తకాన్ని ఇటీవల హైదరాబాద్‌లో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ... నేటి సమాజంలో విద్యార్థుల మానసిక స్థితిగతులపై విశ్లేషణ చేస్తూ, మానసిక వికాసం కోసం రచించిన ఈ పుస్తకం విద్యార్థి లోకానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ రచన చేసిన అభిషేక్ శింగంశెట్టిని ఆయన అభినందించారు. అనంతరం సైకాలజిస్ట్, రచయిత అభిషేక్ శింగంశెట్టి మాట్లాడుతూ... తెలుగు సాహిత్య ప్రపంచంలో విశిష్ట స్థానం సంపాదించిన ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ చేతుల మీదుగా తన తొలి పుస్తకం 'లైఫ్ లాడర్' విడుదల కావడం తనకు గర్వకారణమన్నారు. ఈ అవకాశం కలగడానికి తోడ్పడిన హ్యాండ్‌రైటింగ్ నిపుణులు మల్లికార్జునకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# డిప్యూటీ కలెక్టర్ల నియామకం

నెల్లూరు జిల్లాకు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఈనెల 24న ఉత్తర్వులిచ్చింది. సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా బి. సోమల, జిల్లా విపత్తు నిర్వహణ విభాగం అధికారిగా బి. రజనీకాంత్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# జడ్పీలో ఉద్యోగోన్నతులు

నెల్లూరు జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో విధులు నిర్వహిస్తున్న 17 మందికి ఈనెల 24 ఉద్యోగోన్నతి లభించింది. కార్యాలయ సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కలిగిస్తూ జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి వారికి ఉత్తర్వులిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**యువజన అధికారి మహేంద్రరెడ్డి**

యువతలో సామాజిక స్పృహ పెంపొందించడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నెల్లూరు లోని 'మేరా యువ భారత్' కావలికి చెందిన 'ది పూర్ పీపుల్ వాలంటీర్ ఆర్గనైజేషన్' సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24న కావలి పట్టణంలో "యువ మండల్ వికాస్ అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'మేరా యువభారత్' వేదిక ద్వారా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాసులు, పలు యువజన సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# గృహస్థ ధర్మాలు పాటించాలి

మానవ జీవనయాత్ర సులభతరంగా, ధర్మబద్ధంగా జరగాలంటే గృహస్థ ధర్మాలను పాటించాలని విశ్రాంత తెలుగు అధ్యాపకుడు, ప్రవచనకర్త..విద్వాన్ డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు చెప్పారు. నెల్లూరులోని చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో, వర్ధమాన సమాజం రీడింగ్ రూమ్‌లో ఈనెల 23న జరిగిన కార్యక్రమంలో ఆయన 'గృహస్థ ధర్మాలు' అనే అంశంపై ప్రసంగించి, వాటి ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ పి.రాజేంద్రకుమార్, నెరసం అధ్యక్షులు జయప్రకాష్, చేతన కార్యదర్శి శేషగిరీశం, విఆర్‌సీ విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం. సుబ్రహ్మణ్యం పాల్గొని డా. చీమకుర్తిని సన్మానించారు.

# 'సమయం' పోతే.. మళ్ళీ రాదు!

**జ్ఞాన నేత్రం** — డా. నరసింహారెడ్డి ఊరిమిండి, Dallas, Texas, USA

విద్యార్థి జీవితంలో సమయం అనేది కనిపించని సంపద. డబ్బు కోల్పోతే తిరిగి సంపాదించవచ్చు, మార్కులు తగ్గితే మళ్లీ రాయవచ్చు, కానీ ఒకసారి జారిపోయిన సమయం మాత్రం తిరిగి రాదు...రానే రాదు. ఈ నిజాన్ని చిన్న వయసులోనే గ్రహించిన విద్యార్థి, తన భవిష్యత్తును మరింత స్పష్టంగా నిర్మించు కోగలడు. సమయాన్ని నియంత్రించగలిగినవాడు తన జీవితాన్ని కూడా నియంత్రించగలడు. అందుకే సమయ నిర్వహణ అనేది కేవలం చదువు పద్ధతి కాదు; అది ఒక జీవన విధానం. ఈ జీవన విధానం విద్యార్థికి స్పష్టత, స్థిరత, ఆత్మవిశ్వాసం, మరియు దీర్ఘకాలిక విజయాన్ని అందిస్తుంది. ప్రతిరోజూ మనకు ఇరవై నాలుగు గంటలే ఉంటాయి. కానీ.. కొంతమంది విద్యార్థులు అదే సమయంలో ఎక్కువ నేర్చుకుంటారు, ఎక్కువ సాధిస్తారు, మరికొందరు మాత్రం ఒత్తిడితో, అయోమయంతో, అసంపూర్ణ పనులతో రోజును ముగించేస్తారు?..కారణం ఒక్కటే ..సమయం విలువను తెలుసుకోలేకపోవడం, దానిని సరైన రీతిలో ఉపయోగించుకోలేకపోవడం!... అందుకే, ఎవరైనా సరే..సమయాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే ప్రధానం.

**లక్ష్యం లేని పయనం.. దిశ లేని ప్రయాణం :**

విద్యార్థి జీవితంలో సమయాన్ని వృథా చేసే ప్రధాన కారణం స్పష్టత లేకపోవడం. "ఈ రోజు ఏమి చదవాలి?", "ఎక్కడి నుంచి మొదలుపెట్టాలి?", "ఎంత చదవాలి?" వంటి ప్రశ్నలకు సమాధానం లేకపోతే, మనసు దారి తప్పుతుంది. స్పష్టత లేని రోజు, దిశ లేని ప్రయాణంలాంటిది. అందుకే ప్రతి విద్యార్థి తన రోజును ప్రారంభించే ముందు ఒక చిన్న ప్రణాళిక చేసుకోవాలి. ఇది పెద్ద నోట్స్, పెద్ద షెడ్యూల్ కావాల్సిన అవసరం లేదు. ఒక చిన్న పేపర్ మీద మూడు విషయాలు రాసినా సరిపోతుంది. ఈ రోజు నేర్చుకోవాల్సినవి, పూర్తి చేయాల్సినవి, తప్పక దూరం పెట్టాల్సినవి. ఈ మూడు పాయింట్లు రోజుకు దిశను ఇస్తాయి. సమయ నిర్వహణలో అత్యంత ప్రభావవంతమైన పద్ధతి "బ్లాక్ టైమ్" విధానం. అంటే, రోజును చిన్న చిన్న సమయ బ్లాక్‌లుగా విభజించడం. ఉదాహరణకు, ఉదయం ఒక గంట గణితం, తర్వాత అరగంట విరామం, తర్వాత ఒక గంట భాష, సాయంత్రం రివిజన్..ఇలా. మన మెదడు ఒకేసారి ఎక్కువ పనులు చేయలేదు. కానీ ఒక సమయంలో ఒకపని మీద పూర్తిగా దృష్టిపెట్టగలదు. ఈ బ్లాక్టైమ్ పద్ధతి దృష్టి చెదరకుండా, పనిని పూర్తి చేసే శక్తిని పెంచుతుంది. సమయ నిర్వహణలో మరో ముఖ్యమైన అంశం "ప్రాధాన్యత క్రమం". అన్ని పనులు సమానంగా ముఖ్యమైనవి కావు. కొన్నింటికి వెంటనే చేయాల్సిన అవసరం ఉంటుంది, కొన్నింటికి తర్వాత సమయం ఉంటుంది. విద్యార్థి ఈ తేడాను గుర్తించాలి. ఉదాహరణకు, రేపు పరీక్ష ఉంటే రివిజన్ అత్యంత ముఖ్యమైన పని. కానీ ఒక వారం తర్వాత సమర్పించాల్సిన ప్రాజెక్టును ఆ రోజు చేయాల్సిన అవసరం లేదు. ప్రాధాన్యత క్రమం తెలియకపోతే, విద్యార్థి చిన్న పనుల్లోనే రోజంతా గడిపి, ముఖ్యమైన పనులను చివరికి వదిలేస్తాడు. ఇది ఒత్తిడిని పెంచుతుంది, ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తుంది. సమయాన్ని సరిగ్గా ఉపయోగించడానికి 'విరామాలు' కూడా అంతే ముఖ్యమైనవి. మన మెదడు ఒక నిర్దిష్ట సమయం తర్వాత అలసిపోతుంది. చిన్న విరామాలు తీసుకుంటే మెదడు మళ్లీ శక్తిని పొందుతుంది. ఈ విరామాల్లో మొబైల్ చూడటం, గేమ్స్ ఆడటం, సోషల్ మీడియా స్క్రోల్ చేయడం మాత్రం చేయకూడదు. ఇవి మన దృష్టిని పూర్తిగా దారి తప్పిస్తాయి. బదులుగా, నీళ్లు తాగడం, కాస్త నడవడం, లోతుగా శ్వాస తీసుకోవడం వంటి చిన్న చర్యలు మెదడును ఉత్సాహభరితం చేస్తాయి.

**రాత్రివేళ నిద్ర..చాలా కీలకం :**

సమయ నిర్వహణలో 'రాత్రి నిద్ర' కూడా కీలకం. నిద్రలేమి ఉన్న విద్యార్థి ఎంత ప్రయత్నించినా విద్యపై దృష్టి పెట్టలేడు. రాత్రి ఆలస్యంగా చదవడం కన్నా, సరైన నిద్ర తీసుకుని ఉదయం చదవడం చాలా ప్రభావవంతం. నిద్రను త్యాగం చేసి చదివే విద్యార్థి తాత్కాలికంగా ఎక్కువ చదివినట్లు అనిపించినా, దీర్ఘకాలంలో అది ఫలితం ఇవ్వదు. సమయాన్ని నియంత్రించడానికి "డిజిటల్ డిసిప్లిన్" కూడా అవసరం. మొబైల్‌ఫోన్ విద్యార్థికి ఉపయోగకరమైన సాధనం.. ప్రమాదకరమైన దృష్టి దోపిడీ కూడా. చదువుతున్నప్పుడు మొబైల్‌ను దూరంగా పెట్టడం, నోటిఫికేషన్లు ఆఫ్ చేయడం, చదువు సమయాల్లో సోషల్‌మీడియా యాప్‌లను ఉపయోగించకపోవడం.. ఇవన్నీ సమయాన్ని కాపాడే శక్తివంతమైన అలవాట్లు. ఒక గంట చదువులో ఐదు నిమిషాలు మొబైల్ చూసినా, మన దృష్టి తిరిగి చదువుపైకి రావడానికి మరో పది నిమిషాలు పడుతుంది. ఈ చిన్నచిన్న దృష్టి విఘాతం.. రోజుకు గంటల సమయాన్ని దోచేస్తాయి.

**స్వీయ పరిశీలన అవసరం :**

సమయ నిర్వహణలో చివరిది అయినప్పటికీ, అత్యంత ముఖ్యమైన అంశం 'స్వీయ పరిశీలన'. ప్రతి రోజు చివర్లో ఐదు నిమిషాలు కేటాయించి, "ఈ రోజు నేను సమయాన్ని ఎలా ఉపయోగించాను?", "ఏం బాగా చేశాను?", "ఏం మెరుగుపరచాలి?" అని మనసులో ప్రశ్నించుకోవాలి. ఈ చిన్న పరిశీలన మనలో బాధ్యతను పెంచుతుంది. మనం ఎక్కడ తప్పుతున్నామో, ఎక్కడ మెరుగుపడుతున్నామో స్పష్టంగా తెలుస్తుంది. ఇది చిన్న చిన్న అలవాట్లతో, నిరంతర సాధనతో, మనసులో స్పష్టతతో ఏర్పడే శక్తి. ఈ శక్తి ఉన్న విద్యార్థి ఏ రంగంలోనైనా విజయం సాధించగలడు. మీరు ఈ రోజు నుంచే చిన్న మార్పులు ప్రారంభించండి. ఒక చిన్న ప్రణాళిక, ఒక చిన్న సమయ బ్లాక్, ఒక చిన్న విరామం, ఒక చిన్న పరిశీలన..ఇవన్నీ కలిసి మీ జీవితాన్ని పెద్ద మార్పు వైపు తీసుకెళ్తాయి. సమయాన్ని నియంత్రించండి..మీ భవిష్యత్తు మీ చేతుల్లోకి వస్తుంది.



**వచ్చే వారం:** పాఠ్యపుస్తకాన్ని అర్థం చేసుకునే తెలివైన మార్గం

E-mail: reddyu@gmail.com

## పార్టీ బలోపేతానికి

# అందరూ కృషిచేయాలి

### -- వెంకటగిరి వైసీపీ నేత రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు --



వైసీపీ నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

పార్టీ బలోపేతానికి కమిటీల ఏర్పాటు కీలకమైన ముందడుగు అని, ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేస్తూ పార్టీని పటిష్టవంతం చేసేందుకు కృషిచేయాలని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటగిరిలో గ్రామ, వార్డు, మండల, పట్టణ స్థాయిలో కమిటీలను వెంటనే ఏర్పాటుచేయాలని నాయకులకు సూచించారు. యువజన, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, రైతు విభాగ కమిటీలను సమతుల్యంగా ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలు, లక్ష్యాలు నిర్దేశించాలన్నారు. కమిటీలు కేవలం నామమాత్రంగా కాకుండా, ప్రజల మధ్య పనిచేసే బలమైన వ్యవస్థగా మారాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పార్టీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నెలకు కనీసం ఒక సమీక్షా సమావేశం నిర్వహించి పనితీరు పరిశీలిస్తామన్నారు. కార్యకర్తలకు అండగా నిలుస్తామని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. నేదురుమల్లి కుటుంబం హయాంలో వెంకటగిరి అభివృద్ధి జరగలేదని విమర్శించే ప్రతిపక్ష నాయకులు.. తమ కుటుంబం హయాంలో ఏర్పాటైన 9వ బెటాలియన్, వెంకటగిరి మున్సిపాలిటీగా ఆవిర్భావం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, గురుకుల విద్యాలయాలు, నిమ్మ చీని పరిశోధనా కేంద్రం వంటి ప్రతిష్టాత్మక సంస్థలను మించి అభివృద్ధి చేసి చూపాలని ఆయన అన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో

# ప్రాంగణ ఎంపికలు



కోట మండలం, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఒమార్ వోల్టాంప్-బెంగళూరు కంపెనీవారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు నిర్వహించిన కంపెనీ ప్రతినిధులు..డిజైన్స్ విభాగాధిపతులు శశాంక్ కులకర్ణి అంజనాతలషిల్కార్, హేమంత్ గౌడ (మేనేజర్, మెకానికల్ ఇంజనీరింగ్) మరియు సభ్యులు ఎంపికలు నిర్వహించారు. మెకానికల్-ఎలక్ట్రికల్ విభాగాల నుండి 65 మంది విద్యార్థులు తొలి రౌండ్‌కి హాజరుకాగా, వారిలో 40 మంది (15ఎలక్ట్రికల్, 25 మెకానికల్) విద్యార్థులు రెండవ రౌండ్‌కి రాతపరీక్ష ద్వారా షార్ట్ లిస్ట్ అయ్యారు. పర్సనల్ ఇంటర్వ్యూ తర్వాత ఎంపికైన విద్యార్థులకు మొదట ఇంటర్న్‌షిప్ ఇస్తారని, ఆ తరువాత కంపెనీ తరఫున సంవత్సర వేతనంగా 4.5 లక్షలు ఇస్తారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాసులు, డా.ఎన్ కిషోందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతే.. మా ధ్యేయం!

### ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



పైప్‌లైన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రైతుల అభ్యున్నతే తమ ప్రభుత్వ ధ్యేయమని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నియోజకవర్గంలోని మనుబోలు మండలం కాగితాలపూరు గ్రామపరిధిలో జరుగుతున్న పైపులైను నిర్మాణ పనులతో పాటు చెక్‌డ్యాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే తమకు ముఖ్యమన్నారు. ప్రతి ఎకరాలో పంటలు పండించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కాగితాలపూరు, జట్లకొండూరు రైతుల కోసం యుద్ధప్రాతిపదికన పైపులైను ఏర్పాటు జరుగుతోందన్నారు. రైతులకు కల్పతరువులా పొట్టేళ్లకాలువ చెక్ డ్యాం ఉందన్నారు. ఇటీవల కాగితాలపూరు, కొండూరు పరిధిలో 400కి పైగా ఎకరాల పంటకు నీటికొరత ఏర్పడిందని, అయితే పొట్టేళ్లకాలువపై గతంలోనే టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెక్ డ్యాం రైతులకు ఇప్పుడు చాలా ఉపయోగపడుతోందన్నారు. తాజాగా పైపులైను ద్వారా పంటలకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సుమారు రూ.25 లక్షల అంచనాతో ఒక 10 హెచ్.పీ, ఒక 7.5 హెచ్.పీ మోటార్లతో నీటిని పంప్ చేసి పైపులైను ద్వారా చెరువుకు పంపేలా పనులు జరుగుతున్నాయని తెలిపారు. రైతులు, రైతు ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రైతులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు.

# గూడూరు డివిజన్

# ముత్యాలమ్మకి పాశిం ప్రత్యేక పూజలు



ముత్యాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, చదలవాడ హరిప్రసాద్ తదితరులు

చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 22న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త చదలవాడ హరిప్రసాద్ ఏర్పాటు చేసిన పొంగళ్ల కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్యాలమ్మ జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చదలవాడ హరిప్రసాద్, విజయకుమార్, పులిమి శ్రీనివాసులు, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పడియాల శ్రీహరి, ఉదయభాస్కర్, పేటేటి చంద్రనీల్, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులకి శిరస్త్రాణం తప్పనిసరి



ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సి.ఐ శ్రీనివాస్

ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా శిరస్త్రాణం(హెల్మెట్) ధరించి వాహనాలు నడపాలని రెండో పట్టణ సి.ఐ శ్రీనివాస్ తెలిపారు. గూడూరులోని తిలక్‌నగర్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు ఈ నెల 22న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సి.ఐ మాట్లాడుతూ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని, వాహన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వివేకానంద స్కూల్ 49వ వార్షికోత్సవం



విజేతలకు మెమొంటోలను అందజేస్తున్న అపుస్మా ప్రతినిధులు

గూడూరు పట్టణం, మాలవ్యా నగర్‌లోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 49వ వార్షికోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ వార్షికోత్సవానికి అపుస్మా గూడూరు నియోజకవర్గం గౌరవాధ్యక్షులు దశరథరామిరెడ్డి, అధ్యక్షులు పవన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్‌రెడ్డి, వి.ఎస్.ఆర్ స్కూల్ బాలకృష్ణంరాజు, గూడూరు నియోజకవర్గ పాఠశాలల కరస్పాండెంట్లు అతిథులుగా పాల్గొన్నారు. చిన్నారులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. స్కూల్ కరస్పాండెంట్ చంద్రమోహన్, డైరెక్టర్ వంశీకృష్ణలు మాట్లాడుతూ 1977లో కీర్తిశేషులు తన తండ్రి పురుషోత్తం ఈ స్కూల్‌ను స్థాపించారని, 49 సంవత్సరాలుగా విలువలతో కూడిన విద్యాసేవను అందిస్తూ.. వచ్చే ఏడాది 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందని సంతోషంగా ప్రకటించారు. స్కూల్ ఉపాధ్యాయ బృందం, యాజమాన్యం పాల్గొన్నారు.

# తిప్పవరప్పాడులో సాయి మందిరం



గూడూరు మండలం, తిప్పవరప్పాడులో నూతనంగా నిర్మించిన శ్రీ శిరిడి సాయి మందిరంలో ఈ నెల 24 నుండి 26 వరకు శ్రీ గణపతి, దత్తాత్రేయ నందీశ్వర సహిత శ్రీ శిరిడి సాయిబాబా నూతన విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఈ మూడు రోజులు గణపతిపూజ, గ్రామోత్సవం, మహాకుంభాభిషేకం వైభవంగా జరిగాయి. ఈనెల 27న మండల పూజలు జరుగనున్నాయి. గూడూరు మండల మాజీఅధ్యక్షులు మల్లు విజయకుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మజ్దూర్ నాయకుల నిరసన

రాష్ట్రంలో 12 డిపోల ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ బాధ్యతలు పినాకిల్ సంస్థకు అప్పజెప్పడం మానుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకయ్య తదితరులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద యూనియన్ నాయకులు ఇటీవల ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఛైల్డ్ కేర్ లీవ్‌లను వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్.ఎం.యు.ఎ నాయకులు ప్రవీణ్, శ్రీనివాసులు, బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అళఘునాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు



గూడూరులోని శ్రీశ్రీశ్రీ అళఘ నాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 26న మోహినీ అలంకారంతో మొదలై మార్చి 9వ తేదీ సోమవారం లక్ష తులసి పూజతో ముగియనున్నట్లు అధ్యక్షులు బత్తిన వెంకటసుధాకర్ ప్రసాద్, కమిటీ సభ్యులు కడివేటి రామమూర్తి తదితరులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# ప్రభుత్వాసుపత్రికి రోటరీ ఫిజియోథెరపీ పరికరాలు




పరికరాలను అందజేస్తున్న బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, రోటరీ సభ్యులు

గూడూరు రోటరీ క్లబ్ వారు రోటరీ ఫౌండేషన్ వారి సహకారంతో ఇటీవల గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ సెంటర్‌కు 5 లక్షల రూపాయల విలువచేసే ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. రోటరీ మాజీ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లురెడ్డి, సెక్రటరీ మల్లు విజయకుమార్‌రెడ్డి, ప్రాజెక్టు ఛైర్మన్ కొడిదల మునిగిరీష్, మయూరి శ్యాంయాదవ్ పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!

## తరుణ్ - భవ్య




మురళీకృష్ణ రెస్టారెంట్స్ సారథి గ్రోసు మురళీకృష్ణ - సరితల కుమారుడు
**తరుణ్ కృష్ణ - శివలీలా భవ్య** (ప్రొద్దుటూరు వాస్తవ్యులు శకం రమేష్‌బాబు - ప్రసన్నలక్ష్మిల కుమార్తెల
పరిణయం ఫిబ్రవరి 22వ తేదీ గూడూరులో వైభవంగా జరిగింది.
నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

## శ్రేయ - ప్రేమ్




నెల్లూరు వాస్తవ్యులు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ - డాక్టర్ సర్వేపల్లి లక్ష్మీశారదల కుమార్తె
**డా॥ నవ మల్లిక శ్రేయ - డా॥ వెంకట ప్రేమ్ నరసింహారావు** (నరసరావుపేట వాస్తవ్యులు
బ్రహ్మశ్రీ ఇక్కుర్తి వీరరాఘవరావు - పద్మలతల కుమారుడు)ల వివాహం ఫిబ్రవరి 21వ తేదీ
నెల్లూరులో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## కార్తీక్ - హర్షిత



నెల్లూరులోని రైతు డిపో అధినేత వీరిశెట్టి సుధాకర్ - విజయకుమారిల కుమారుడు
**కార్తీక్ - హర్షిత** (నాయుడుపేట వాస్తవ్యులు బద్రి వేణుగోపాల్ - శ్రీలక్ష్మిల కుమార్తెల
పెళ్లి ఫిబ్రవరి 19వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

## తేజ - రమ్యశ్రీ



ఉమ్మడి నెల్లూరు జిల్లా టిడిపి నాయకుడు శ్రీనివాస్ చౌదరి - శిరీషల కుమారుడు
**మోక్షజ్ఞ శివరామతేజ - రమ్యశ్రీ** (హైదరాబాదు వాస్తవ్యులు గొట్టిపాటి హరిప్రసాద్ - పరమహంసల
కుమార్తెల కళ్యాణం ఫిబ్రవరి 25న హైదరాబాదులో ఘనంగా జరిగింది.
నవ దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# కళ్ళని కాపాడుకోండి!

## వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి పిలుపు




విజయోత్సవ సభలో మాట్లాడుతున్న కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, పక్కన విపిఆర్

మనిషి జీవన మనుగడ ఆరోగ్యవంతంగా, ప్రశాంతకరంగా కొనసాగాలంటే శరీరంలోని అన్ని ముఖ్య అవయవాలతో పాటు కళ్ళు అతి ప్రధానమైనవని, వాటిని జాగ్రత్తగా చూసుకుని కంటి చూపుని కాపాడుకోవాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, శాంతాబయో టెక్నిక్స్ వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. తోటపల్లిగూడూరు వాస్తవ్యులు కీర్తిశేషులు కోడూరు వెంకట రమణారెడ్డి - శ్రీమతి శాంతమ్మల స్మృత్యంకంగా 9రోజుల పాటు జరిగిన 'ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం' ఫిబ్రవరి 23వతేదీ సోమవారంతో ముగిసింది. వరప్రసాద్‌రెడ్డి దాతృత్వంతో చెన్నై, శంకరనేత్రాలయ, శాంతా-వసంత ట్రస్టు, హైదరాబాదు సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించబడింది. ముగింపు సందర్భంగా జరిగిన విజయోత్సవ సభలో నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరిని మర్చిపోకూడదనే ఆశయంతో మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఎందరికో ఆదర్శప్రాయులని అన్నారు. పల్లె ప్రాంతాలలో ఎంతోమంది ఆర్థిక స్థోమత లేక కంటి చూపును నిర్లక్ష్యం చేస్తుంటారని, అలాంటి వారికి శాంత-వసంత ట్రస్టు ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సంస్థను తీసుకువచ్చి కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేయించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డిని వీపిఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

తాము కూడా విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విపిఆర్ నేత్ర' కార్యక్రమం కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటుచేసి ప్రతి గ్రామానికి తీసుకువస్తున్నామన్నారు. ఆ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు ఉదయగిరిలోని 5 మండలాల్లో 26 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు అందించామన్నారు. త్వరలోనే జిల్లాలోని గ్రామాలకి కూడా తమ సేవలు విస్తరిస్తామన్నారు. సభా కార్యక్రమానికి ముందు వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆపరేషన్లు చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ఇదే సభలో కార్యక్రమ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 40 నుండి 50 ఏళ్ళ మధ్య ఉన్న వ్యక్తులలో కంటి చూపు మందగించడం సాధారణ విషయమన్నారు. అలాంటి వారి చూపును మెరుగు పరిచేందుకు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కంటి పరీక్షలు చేయించుకునే స్తోమత లేక చాలామంది కంటిచూపుని నిర్లక్ష్యం చేస్తుంటారని అన్నారు. అలాంటి వారి కోసమే తమ అమ్మానాన్నల జ్ఞాపకార్థం ఈ ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని నిర్వహించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా అర్హులకు విస్తృత సేవలందిస్తున్న శంకర నేత్రాలయ సంస్థ తమ ప్రాంతానికి వచ్చి క్యాంపు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణులకు ఎంతో ఓపికతో ఆపరేషన్లు చేస్తున్న డాక్టర్లకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్యాంపు జరిగిన మొత్తం 9రోజులలో 612మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.



వారిలో 198 మందికి కంటి పొర చికిత్స అవసరమని గుర్తించారు. అయితే వారిలో కొంత మందిని చెన్నైకి రెఫర్ చేయగా 96మందికి స్థానికంగా ఆపరేషన్లు చేశారు. స్థానిక తోటపల్లి గూడూరు నాయకులు, కోడూరు కుటుంబసభ్యులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారు.

# 'యక్షిత' ఆరోగ్యం కోసం.. స్కూలు యాజమాన్యం చేయూత



ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి సేకరించిన తొమ్మిదిన్నర లక్షల రూపాయలను యక్షిత కుటుంబసభ్యులకు అందజేస్తున్న ఎం.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు.

నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలట్ స్కూల్‌లో 3వ తరగతి చదువుకుంటున్న యక్షిత కాలేయవ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో, ఆ బాలిక వైద్యచికిత్సలకు స్కూలు యాజమాన్యం వారు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రుల నుంచి సుమారు తొమ్మిదిన్నర లక్షల రూపాయలు సేకరించి ఇచ్చారు. చికిత్సకు కనీసం 25 లక్షల వరకు అవుతుందని వైద్యులు సూచించడంతో, ఆమేరకు వారు తమవంతు చేయూతనందించారు. ఈనెల 25న ఆ సాయం చెక్కును బాధిత బాలిక కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం యక్షిత త్వరగా ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ ఛైర్మెన్ ఎంవీ సుబ్బారెడ్డి, డైరెక్టర్లు నరేంద్రరెడ్డి, డా.సుబ్రామ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అమ్మభాషపై.. మమకారం పెంచుకోవాలి!

## • వేద విజ్ఞాన వేదిక సభలో పద్మభూషణ్ డా. వరప్రసాద్‌రెడ్డి

ప్రతిఒక్కరూ మాతృభాషపై మమకారం పెంచుకోవాలని, తెలుగు భాషా.. సాహిత్యాలను పరిరక్షించుకోవాలని శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు..పద్మభూషణ్ డా.కేఐ వరప్రసాద్‌రెడ్డి చెప్పారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక 16వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22న చైన్నై–టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాతృభాష విశిష్టతను తెలియజెప్పారు. జాతి ఏదైనప్పటికీ..ఆ జాతి అభివృద్ధికి భాష–సంస్కృతి అనేవి మూలకారణాలుగా ఉంటాయన్నారు. ఘనమైన మన భారతీయ సంస్కృతి ప్రపంచదేశాలకు ఆదర్శమన్నారు. విద్యార్థులు కేవలం మార్కులపైనే దృష్టి పెట్టకుండా, సంస్కారం కూడా అలవరచుకోవాలన్నారు. తెలుగు చదువుకుంటే మార్కులు రావని కొందరు ఇతర భాషలను చదువుకుంటున్నారని, మనం పుట్టిన గడ్డపై అనేక అవకాశాలున్నా అమెరికాలాంటి విదేశాలకు వెళ్ళాలని తహతహలాడుతున్నారని ఆయన అంటూ, ఇకనైనా అలాంటి సంస్కృతి మారాలన్నారు. సమయం–గౌరవం ఎగిరిపోతే..అవి తిరిగిరాని పక్షులని ఆయన అంటూ, ఆ నమ్మకంతోనే వేద విజ్ఞానవేదిక వారు పాటించిన సమయపాలన ముచ్చట గొలిపిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భారత, రామాయణ, భాగవతాలలో ఉన్న జీవన విలువలను ప్రజల చెంతకు తీసుకెళ్లాలని సూచించారు. "తెలుగు భాషను మనం కాపాడటం కాదు...తెలుగు భాషే మనల్ని కాపాడుతుంది" అని ఆయన అన్నారు. ఈ సభకు వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి అధ్యక్షత వహించగా, అరుణ శ్రీనాథ్ ప్రార్థనా గీతాన్ని గానం చేశారు. తెలుగు భాష మాధుర్యాన్ని నేటి తరానికి చేరవేస్తూ 16 సంవత్స రాలుగా వేద విజ్ఞాన వేదిక క్రమశిక్షణ, సమయపాలనతో కార్యక్రమాలు నిర్వహిస్తోందని వేదిక కార్యదర్శి కందనూరు మధు తన స్వాగతోపన్యాసంలో తెలిపారు. ప్రముఖ సినీ నటి ఊర్వశి శారద, కళారత్న ప్రభా రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభా రమేష్ 'సితార్ నీరాజనం', కుమారి భవ్య తూములూరు 'సంగీత నీరాజనం' సభికులను అలరించాయి.



డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, ప్రభలను సత్కరిస్తున్న వేదివిజ్ఞాన వేదిక నిర్వాహకులు

### శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి

శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాక్‌వర్త్ పరిశ్రమ వితరణతో ఇరుగుళం, మాదనపాళెం, అరవపాలెం జడ్పీ హైస్కూళ్ల పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 25న పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, పరీక్షలు వ్రాయడం కోసం ఒక్కో విద్యార్థికి ఒక రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీ బాక్స్ చొప్పున మొత్తం 130 మంది విద్యార్థులకు మెటీరియల్ అందచేశారు. ఆయా స్కూళ్ల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో రాక్‌వర్త్ ప్లాంట్ హెడ్ శ్రీరామ్, కంపెనీ సిబ్బంది వాటిని విద్యార్థులకు ఇచ్చారు. రాక్‌వర్త్ చొరవ అభినందనీయమని, ఈ సహకారం కొనసాగాలని శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి అన్నారు.



# పాలకేంద్రాలపై.. ముమ్మరంగా తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

కల్తీపాల ఘటనతో రాజమహేంద్రవరంలో పలువురు మరణించి నేపథ్యంలో, జిల్లాలోనూ పాల సరఫరాల పట్ల అధికారులు దృష్టిపెట్టారు. ఈనెల 25న నెల్లూరు నగరంలోని వేదాయపాలెం, నవాబ్‌పేట ప్రాంతాలలో ఉన్న కొన్ని పాలకేంద్రాలను ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా సందర్శించి పాల నమూనాలను సేకరించి, వాటిని పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపారు. ఆహార భద్రత శాఖ వారు అందించిన మ్యాజిక్ బాక్స్ కిట్‌ను ఉపయోగించి పాలలో ఎలాంటి కల్తీ జరిగిందో పరీక్షిస్తున్నారు. ముఖ్యంగా యూరియా, డిటర్జెంట్, స్టార్చ్, గ్లూకోజ్ మరియు సుక్రోజ్ వంటి కల్తీ పదార్థాలు పాలలో ఉన్నాయా లేదా అన్నది తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా,అవగాహన పోస్టర్లను గోడలపై అంటించి ప్రజలకు విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నారు కూడా. పాలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులున్నా వేదాయపాళెంలోని ఆహార భద్రత కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీ.వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారిణి డి.నీరజ, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ కుమారి ఎం.ప్రణుతి ఫ్లోరా తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ మాఫియాలపై..

## 28న ఆందోళన




మాట్లాడుతున్న సీపీఐ నాయకులు అరిగెల సాయి, తదితరులు

మెడికల్ మాఫియాలను నిరోధించేంతవరకు పోరాటం ఆపేది లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి చెప్పారు. బుధవారం నెల్లూరులోని రామకోటయ్యభవన్‌లో పఠాన్ జిలానిఖాన్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మెడికల్, డ్రగ్స్ మాఫియాపై ఈనెల 28న ఉద్య మానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ ఆసుపత్రుల ఆగడాలను అరికట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, డ్రగ్స్ కంట్రోల్ విభాగంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. నకిలీ మందులు అమ్మే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులలో ఆరోగ్యపరీక్షల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి తమ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు దామా అంకయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మధు, రమణయ్య, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర, అభ్యుదయం, ఆధ్యాత్మికతల సమాహారం.. 'పుష్పగిరి'

'పుష్పగిరి' ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. పినాకినీ నదీ తీరాన వెలసిన మహిమాన్విత క్షేత్రం. ఆ ప్రాంతంలో ఆత్మీయానుబంధం చిన్ననాటి నుండే కలిగిన రచయిత్రి ఎస్.వి.యం. నాగగాయత్రి. చారిత్రక అంశాలు – కల్పనల సమ్మేళనంగా 'పుష్పగిరి' నవలను మలిచారు.


ఏనాడో జరిగిపోయిన ఒక సంఘటన. ఈ నవల మొత్తానికి ఒక ఆలంబన. కాల ప్రభావానికి, అదుపాజ్ఞలకు లోబడిన పాత్ర 'వైదేహి'. తనలోని అంతఃచేతనను, తన రహస్యాన్ని, తనలోనే నిక్షిప్తం చేసుకుని పైకి ఏమీ తెలీనట్టే అమాయకంగా జీవిస్తుంది. నవలలో వైదేహి పాత్ర చాలా చిన్నదే అయినా, నవల మొత్తానికి ఆమె కారకురాలు, ప్రేరకురాలు, సాధకురాలు కూడ.

పరిస్థితుల ప్రాబల్యం వలన గర్భం దాల్చిన ఒక స్త్రీ తన కడుపులో పెరిగే బిడ్డ విషయంలో ఆమె తీసుకునే నిర్ణయాల చుట్టూ ఈ కథను రచయిత్రి నాగగాయత్రి ఆసక్తికరంగా ఆలోచనలు రేకెత్తించేలా అల్లారు. ఇలాంటి ఇతివృత్తాన్ని ఎంచుకోవటం సాహసమే! మనుషులందరూ మంచివాళ్లుగానే ఉన్న వ్యవస్థలో ఈ కథ సుఖాంతం కావడం హర్షదాయకం.

నాగగాయత్రి ఎల్.ఐ.సిలో పనిచేస్తూ సాహితీ సృజనలో తలమునకలయి వుంటారు. కథలు, కవితలు, వ్యాసాలూ రాస్తుంటారు. ఒక సామాజిక సమస్యను స్పృశిస్తూ ఆమె ఈ నవలను రాశారు. నవల ఆసాంతం చదివించగల 'శైలి' ఆమె ప్రత్యేకత.

ఇంతేగాక కథను ఒకపక్క చెప్తూనే పుణ్యక్షేత్రాన్ని నేపథ్యంగా తీసుకోవడం ఆమెలోని రచనా సామర్థ్యానికి ఉదాహరణ. చారిత్రక అంశాలు – కల్పనల చైతన్య సమ్మేళనం పుష్పగిరి నవల. అంతేగాక గ్రామీణ వాతావరణాన్ని, అక్కడి సంస్కృతిని, ఆచారవ్యవహారాలు, జీవన విధానాన్ని రసవత్తరంగా, ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా వర్ణించారు రచయిత్రి. ఇందులో ఆధ్యాత్మిక విషయాలున్నాయి. చారిత్రక విషయాలున్నాయి. అనుభూతి వుంది. అన్నింటికీ మించి అభ్యుదయ భావాలున్నాయి. ఇన్నింటిని కలగలుపుకుని 'నవల' రాయటం కత్తిమీద సామే! గాయత్రి అందులో విజయం సాధించారని చెప్పక తప్పదు.

నవల మొదట్లోనే ఆమె 'పుష్పగిరి' పుణ్యక్షేత్రం గురించి ఇలా రాశారు – 'పుష్పగిరి.. కొండొకచో పురాణాల్లో ప్రస్తావించబడ్డ పుణ్యక్షేత్రం. కాలం రాసిన శాసనాలు తలదాల్చి.. తన వైభవాన్ని, ప్రాశస్త్యాన్ని... రహస్యాలతో బాటుగా తనలోనే నిక్షిప్తం చేసుకుని, పైకి అమాయక పల్లెపడుచులా కనిపించే మర్మదేశం'...






రచయిత్రి:
**ఎస్.వి.ఎం. నాగ గాయత్రి**
సెల్: 94404 65797
వెల: రూ. 100/- పేజీలు: 112
ప్రతులకు: ఎస్‌విఎం నాగగాయత్రి
సి2, సాయి బృందావనం అపార్ట్‌మెంట్స్
ఆర్టీఓ ఆఫీసు రోడ్డు, బి.వి.నగర్, నెల్లూరు-4

ఇందులోనే నవల ఇతివృత్తం అంతర్లీనంగా దాగివుంది నాటకానికి నాందీ ప్రస్తావన లాగా. రచయిత్రి రచనా చాతుర్యానికి నిదర్శనంగా. ఇకపోతే వైదేహి, అనఘ, శంకర్, భవిష్యత్ చెప్పే శివుడు నంబూద్రి, సిద్ధుడు లాంటి పాత్రలు జానపద వాతావరణాన్ని కళ్లకు కడతాయి.

అనాథ అయిన అనఘ మానసిక వేదనను రచయిత్రి హృద్యంగా చిత్రించారు. కంటతడి పెట్టించారు. తనను అనాథను చేసిందే అన్న కోపంతో రగిలే అనఘ తల్లిని చూడగానే కరిగిపోవడం రక్తసంబంధాల విలువలను తెలుపుతుంది. తల్లీ బిడ్డల అనురాగాన్ని ఆవిష్కరిస్తుంది. బిడ్డను బహు కాలం తర్వాత చూసిన వైదేహిలోని భావోద్వేగాన్ని రచయిత్రి చాలా సహజంగా వర్ణించారు.

విశ్వేశ్వరశర్మ పాత్ర ఎంతో ఉదాత్తం. ఆయన గ్రామానికి రక్షకుడు. నవలలో అత్యంత ప్రధానమైన పాత్ర. చివర్లో ఆయన్ను గురించి చెప్తూ "ఆ పల్లెవాసుల మధ్య విశ్వేశ్వర శర్మ ప్రస్తావన లేనిరోజు వుండదు. కొండమీద దైవం.. చెన్నకేశవుడైతే, వారు చూసిన ప్రత్యక్ష దైవం విశ్వేశ్వరశర్మ" అంటారు రచయిత్రి. నిజమే నవల చదివిన ప్రతి పాఠకుడూ విశ్వేశ్వరశర్మలోని ఔన్నత్యానికి అబ్బురపడతాడు. రచయిత్రి ఆ పాత్రను తీర్చిదిద్దడంలో చూపిన నైపుణ్యం అలాంటిది మరి. పెనుజలాల పెన్నా ఒడిలో పుష్పమై తేలే పర్వతం పుష్పగిరి. గరుత్మంతుడి రెక్కల గాలి తాకిన చరిత్ర ముత్యం అది... అంటూ పుష్పగిరి గురించి ఎన్నో చారిత్రక వివరాలను రచయిత్రి ఆసక్తికరంగా పాఠకులకు అందించారు.

ఏదేమయినా ఇలా 'చరిత్ర', ఆధ్యాత్మికత, సమాజ సంస్కరణ, జానపద వాతావరణం అన్నీ కలగలిసి నవలగా రాయడం ఎస్.వి.యం. నాగగాయత్రి ప్రత్యేకత అని చెప్పవచ్చు!



డా. గంగిశెట్టి శివకుమార్
సెల్: 94418 95343

## 'జ్ఞాననేత్రం' తెరిపిస్తూ...



జీవనోపాధి విద్యా సంఘర్షణల్లో
మీ మాటలు సమన్వయ బాటలై
ఎందరికో విజయబావుటాలై
శృతిలయల సుస్వర పాటలై
అందరి హృదయాలను అలరించాలని...
సేవా సూత్రాన్ని విస్తరిస్తూ
మీ మనోగాత్రాన్ని వినిపిస్తూ
విద్యార్థుల్లో 'జ్ఞాననేత్రం' తెరిపిస్తూ
సన్మార్గదర్శిగా వ్యాసాలు రచిస్తున్న
ఊరిమిండి నరసింహారెడ్డి గారూ
అభినందన వందన మందారాలు!

బొగ్గరపు రాధాకృష్ణమూర్తి
నెల్లూరు. సెల్ : 98854 81939.

# గత ప్రభుత్వ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

## ● అసెంబ్లీలో సోమిరెడ్డి సూచన



ఫ్రీహోల్డ్ పేరుతో గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలంటూ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. ఫ్రీహోల్డ్ పేరుతో వైసీపీ నేతలు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, పేదల దగ్గర తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసుకుని, అధిక ధరలకు అమ్ముకున్నారని ఆయన అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఫ్రీహోల్డ్ పేరుతో జరిగిన నేరాలు ఘోరాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, నెల్లూరు జిల్లాలో జరిగిన భూఅక్రమాలపై చర్యలకు సంబంధించి సమీక్ష నిర్వహించాలని రెవెన్యూ మంత్రికి విజ్ఞప్తిచేశారు.

### గ్రీన్ ఎనర్జీ.. సోలార్‌లు రావడం శుభపరిణామం :

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సోలార్ తదితర ప్రత్యామ్నాయాలు రావడం శుభ పరిణామమని, వాతావరణంలో కర్బన ఉద్గారాలు తగ్గడం ప్రజలందరికి అవసరమని ఆయన అంటూ, సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటు కోసం అసైన్డ్ భూములను లీజులకు తీసుకునేలా చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఆ యూనిట్ల కోసం తీసుకునే భూములకు ఎకరాకు కనీసం రూ.30 వేలు లీజు వచ్చేలా చూడాలన్నారు. అయితే, సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేసే భూములకు సంబంధించిన ప్రయోజనం కేవలం అసలు లబ్ధిదారులకే కలగాలన్నారు. మధ్యలో దురాక్రమణ చేసిన వారికి ఆ లబ్ధి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ● ఫలించిన..కోటంరెడ్డి కృషి





## కొండాయపాళెం, బీవీనగర్ రైల్వే గేట్ల వద్ద

# అండర్‌పాస్‌ల నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్

### త్వరలో టెండర్లు... తీరిపోనున్న ట్రాఫిక్ కష్టాలు

నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని కొండాయపాళెం, బీవీనగర్‌ల మీదుగా అటునుంచి ఇటుకు వెళ్ళాలంటే ఎన్ని కష్టాలో స్థానికులకు తెలుసు. రైళ్ళ రాకపోకలతో ఈ గేట్లు చాలాసేపు మూసే ఉంటుంటాయి. రైళ్ళ రాకపోకల్లో ఏ మాత్రం జాప్యం జరిగినా, గేట్లు తెరవడం కూడా ఆలస్యమై, అత్యవసరపు పనులు ఉన్నవారు మరెంతో ఇబ్బందులు పడుతుంటారు. ఒక్కోసారి మూడు, నాలుగురైళ్లు కూడా ఒకదాని తర్వాత మరొకటి వెళ్తుండడంతో, ఈ గేట్ల వద్ద వాహనదారులు నిరీక్షించాల్సి వస్తోంది. ఎంతోకాలంగా ఉన్న ఈ ఇబ్బందులకు చెక్ పెడుతూ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ గేట్ల వద్ద అండర్ పాస్‌ల ఏర్పాటుకు కృషిచేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కేంద్రంతో సంప్రదింపులు జరిపి, ఎట్టకేలకు ఇటీవలే వాటి నిర్మాణాలకు అవసరమైన నిధులను కూడా సాధించారు. దీంతో కేంద్రం ఈ నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లయింది. ఈ అండర్‌పాస్‌ల నిర్మాణాలకి ఒకదానికి 15.50 కోట్లు, మరొకదానికి 16.50 కోట్ల రూపాయల వంతున నిధులు మంజూరు చేయించారు కూడా. ఆమేరకు నెలరోజుల్లోగానే వాటికి టెండర్లు పిలవనున్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు కోటంరెడ్డి చొరవతో.. ఈ గేట్ల వద్ద ఎక్కువసేపు నిరీక్షించే అవస్తలు ఇక తప్పుతాయని కొండాయ పాళెం, బీవీనగర్ వాసులు, నగర ప్రజలు సంతోషిస్తున్నారు.

## ఆటపాటలతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా ..

# డా. కిషోర్స్ రత్నం స్కూల్ వార్షికోత్సవం



నెల్లూరులోని డా.కిశోర్స్ రత్నం థింక్ నెక్స్ట్ ఒలింపియాడ్ స్కూల్ వార్షికోత్సవం ఇటీవల స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో పెద్దసంఖ్యలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులతో ఉల్లాసభరితంగా జరిగింది. ప్లే క్లాసు నుంచి 9వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు వందల సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. నృత్యాలు, గేయాలు, నాటికలు, సృజనాత్మక ప్రదర్శనల ద్వారా వార్షికోత్సవ వేడుకలను అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆ స్కూల్ డైరెక్టర్లు డా. కె.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారి వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసాలను పెంపొందించవచ్చని వారు తెలిపారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, జూనియర్ మేనేజర్ అజయ్‌కుమార్, ఏఓ తుహిన, సునీల్‌కుమార్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు..

# 161 కేంద్రాలు

జిల్లాలో ఈ రబీసీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు 161 కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామని జిల్లా సహకారశాఖ అధికారి గురప్ప తెలిపారు. ధాన్యం సేకరణకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, సక్రమంగా నిర్వహించాలని ఈనెల 25న జరిగిన వీడియో సమావేశంలో ఆయన అధికారులను ఆదేశించారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com